విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 24 జూన్ 2025 8 పేజీలు

ప్రమాదపుటంచున పాఠశాల విద్య

మున్సిపల్ స్కూళ్లలో తగ్గిపోతున్న అడ్మిషన్లు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ఏలూరు కార్పొరేషన్ పరిధిలోని మున్సిపల్ పాఠశాలల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారైంది. రానున్న రోజుల్లో ఏలూరు నగరపాలక సంస్థ పాఠశాలలు మరింత గడ్డు స్థితిని ఎదుర్కోబోతున్నాయి. కార్పొరేషన్ పాఠశాలలో చేరే విద్యార్థుల సంఖ్య అంతకంతకు తగ్గిపోతోంది. మరోపక్క సర్‌ప్లస్ ఉపాధ్యాయుల సంఖ్య పెరిగిపోతోంది. దీనిపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.

తలపోటుగా మారిన సర్దుబాటు

అవసరాన్ని మించి ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం అంతకంతకు అధికారులకు పెద్ద సమస్యగా మారిపోతోంది. ఇటీవల జరిగిన బదిలీల్లో ఏలూరు కార్పొరేషన్ పాఠశాలల్లో ▶మిగతా 2లో..

పాలకులపై పోరాటాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్
- జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-కొయ్యలగూడెం: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకులపై పోరాటాలు ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం సీపీఐ కొయ్యలగూడెం మండల సమితి 11వ మహాసభ లక్క లక్ష్మణరావు, పార్వతి అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ అంతర్జాతీయ చట్టాలను బేఖాతరు చేసి ఆటవికంగా అమెరికా దాడులకు తెగబడు తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా దాడులపై మోడీ ప్రభుత్వ వైఖరి నిరుత్సాహకరంగా ఉందని విమర్శించారు. భారత్ అవలంబిస్తున్న విదేశాంగ విధానానికి ఇది విరుద్ధమన్నారు. భారత విదేశాంగ విధానం ఎల్లప్పుడూ యుద్ధాన్ని వ్యతిరేకిస్తుందని, ఇరాన్ పై జరుగుతున్న దాడికి,పాలస్తీనా మారణ హోమానికి వ్యతిరేకంగా మోడీ నోరు విప్పాల న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన సమస్యలను పక్కనపెట్టి యోగా పేరుతో ప్రధాని మోడీ మెప్పుకోసం డ్వాక్రా మహిళలు, ఉపాధి కార్మికులను బెదిరించి యోగాకు తరలించడం సిగ్గుచేటు అన్నారు.గిన్నిస్ రికార్డులతో ప్రజలకు ఒరిగేదేమీ లేదని,వందల కోట్ల రూపాయల ప్రజల సొమ్ము వృధా అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా వ్యవస్థను గందరగోళంలో నెట్టిందన్నారు. సామాన్యులకు విద్యను అందుబాటులో లేకుండా చేస్తున్నారని విమర్శించారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లా డుతూ కేంద్రం,రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందన్నారు. పాలకులు, ప్రతిపక్ష పార్టీలు హింస ప్రేరేపిత వ్యాఖ్యలు చేస్తున్నారని, ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ప్రేరేపించేలా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి గత ఎన్నికల సందర్భంగా వాగ్దానం చేసిన సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా రైతులకు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇవ్వాలని, మహిళలకు రూ.1500 ఇస్తామని చేసిన వాగ్దానాన్ని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్ట్ డిజైన్ మేరకు యధావిధిగా 45.72 మీటర్ల ఎత్తులోని నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు పునరావాస కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించి,పూర్తి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొయ్యలగూడెం మండలంలో రాజవరం, కనకాద్రిపురం, ఎర్రంపేట,తిమ్మన కుంట, మంగపతి దేవి పేట,గ్రామాలలో పేద ప్రజలకు భూములు పంపిణీ చేసిన ఘనత సీపీఐదే అన్నారు. ఈ మహాసభలో సీపీఐ పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు బాడిస రాము, జేవి రమణ రాజు,జిల్లా కౌన్సిల్ సభ్యులు బాలకృష్ణ, టీవీఎస్ రాజు, సీపీఐ బుట్టాయిగూడెం మండల సహాయ కార్యదర్శి బి. కిషోర్, సీనియర్ నాయకులు దుగ్గిరాల నారాయణరావు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలు విజయవంతం చేయండి

జిల్లా కార్యదర్శి కె. సత్తిబాబు పిలుపు

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సీపీఐ రెండవ జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం సమావేశం ఆహ్వాన సంఘ అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ చెల్లుబోయిన కేశవశెట్టి అధ్యక్షతన జరిగింది. ఆహ్వాన సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్, రామచంద్రాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండవల్లి గోపాలరావు నేతృత్వంలో సమావేశం స్థానిక ఎస్‌టియు కార్యాలయంలో సోమవారం జరిగింది. ఆహ్వాన సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సత్తిబాబు మహాసభల కరపత్రం విడుదల చేశారు. మంగళవారం నుంచి జిల్లాలో 7 నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరపాలని, పార్టీశాఖలు విస్తృతంగా మహాసభ కరపత్రం పంపిణీ చేసి పార్టీ మండల, నియోజకవర్గ మహాసభలు నిర్వహించాలని, ప్రజలు పార్టీ సభ్యులు, సానుభూతి పరుల నుంచి విరాళాలు సేకరించి పార్టీ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ప్రతీ పార్టీ సభ్యులు, ప్రజా సంఘ బాధ్యులు తమతో ఒకర్ని తీసుకుని రావాలని తద్వారా పెద్ద ఎత్తున స్వచ్ఛంద జన సమీకరణ సాధ్యమని జిల్లా కార్యదర్శి కె సత్తిబాబు పేర్కొన్నారు. మహాసభలు నిర్వహించే జిల్లా కేంద్రం అమలా పురంలో జులై 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ప్రచార దళం నిర్వహించాలని, నియోజకవర్గ మూడు మండలాల్లో పుర ప్రముఖులను వ్యాపార వర్గాలను, విద్య, మేధావి వర్గాల వారిని, వైద్యరంగం నిపుణులను కలసి మహాసభల క్రియాశీలత 100 సంవత్సరాల భారత కమ్యూనిస్టు పార్టీ ప్రస్థానాన్ని వివరించాలని తెలిపారు. పార్టీ జిల్లా, రాష్ట్ర మహాసభల జయప్రదానికి మద్దతు కూడగట్టేం దుకు దశల వారిగా జిల్లా అంతా తిరగాలని సమావేశం తీర్మానించిందని ▶మిగతా 2లో..

సచివాలయ ఉద్యోగుల నిరసన

విశాలాంధ్ర - కాకినాడ : ఉద్యోగుల బదిలీలలో హేతుబద్ధీకరణకు సంబంధించిన జీవోలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సచివాలయ ఉద్యోగులు సోమవారం కాకినాడ మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ, స్థానిక సంస్థలలో (ఖాదీలు)జీఎస్ డబ్ల్యూఎస్ వ్యవస్థ కింద పనిచేస్తున్న ఉద్యోగులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవోలకు సంబంధించి పలు సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఉద్యోగులు తమ స్వస్థల మండలంలో పనిచేయడాన్ని నిషేధిస్తుందని, ఇది యూఎల్బీ ప్రాంతాలలో తీవ్ర ఇబ్బందులను కలిగిస్తోందన్నారు. పట్టణ ఉద్యోగులకు మండలంలో కాకుండా స్థానిక వార్డును బదిలీలకు యూనిట్‌గా పరిగణించాలని కోరారు. మిగులు సిబ్బందిని ఎలా గుర్తించి నిర్వహిస్తారనే దానిపై జీవోలో స్పష్టత లేదన్నారు. పారదర్శక ప్రమాణాలు లేకుండా డిప్యుటేషన్లు జరగవచ్చనే ఆందోళన ఉందని,పూర్తి హేతుబద్ధీకరణతో మార్గదర్శకాలు జారీ చేసిన తర్వాత మాత్రమే బదిలీలను ప్రారంభించాలన్నారు. చాలా మంది ఉద్యోగులు ఐదు సంవత్సరాలకు పైగా సర్వీస్ పూర్తి చేసి పదోన్నతి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. బదిలీలు ప్రారంభించే ముందు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, నోషనల్ ఇంక్రిమెంట్‌లు, ఇతర ఆర్థిక ప్రయోజనాలను ▶మిగతా 2లో..

కోకో రైతులతో కలెక్టర్ ముఖాముఖి

విశాలాంధ్ర - నల్లజర్ల : రాష్ట్ర ప్రభుత్వం కోకో రైతుల నుంచి ప్రతి గింజ కొనుగోలు చేసేందుకు మద్దతుధర ఇవ్వడం జరుగుతుందని, కోకో రైతులు నుంచి కంపెనీలు రూ.500 లకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. సోమవారం నల్లజర్ల మండలం చోడవరం గ్రామంలో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి, కోకో రైతులతో మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక రైతు కొత్తపల్లి చంద్ర శేఖర్ మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన కోకో కేజీ ఒక్కింటికి ▶మిగతా 2లో..

కాగుపాడు హైస్కూల్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

విశాలాంధ్ర- ఉంగుటూరు : 2025 మార్చిలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రతిభ చూపిన ఉంగుటూరు మండలం కాగుపాడు హైస్కూల్ విద్యార్థులకు కాగుపాడు గ్రామస్తులు, రిటైర్ వైద్య ఉద్యోగి కొరపాటి ఆంజనేయులు జ్ఞాపకార్థం వారి కుమార్తె మణికుమారి ప్రోత్సాహక

నగదు బహుమతులు సోమవారం అందజేశారు. మాజీ సర్పంచ్, తెలుగుదేశం నాయకులు కడియాల రవిశంకర్ చేతులమీదుగా పాఠశాల ప్రథమ స్థానం పొందిన ధనుకొండ ప్రేమ్ కుమార్ కు ఐదు వేల రూపాయలు, ద్వితీయ స్థానం పొందిన ఉసురుమర్తి రేణుకాశ్రీ కి మూడు వేల రూపాయలు, తృతీయ స్థానం పొందిన వెలగపల్లి అనన్య గ్రేస్‌కు రెండు వేల రూపాయలు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ కర్రి బాలకృష్ణ, ఇన్‌చార్జి హెచ్‌ఎం కళ్యాణ్ కుమార్, శీతాల సత్య నారాయణ, కొరపాటి వెంకటరావు, రాజేష్, ఆశీర్వాదం, ముత్యాలరాజు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై గోతులు

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెంలోని అక్షర నందన పాఠశాల సమీపంలో ప్రధాన రహదారిపై గోతులు పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయంగా ఉంది. ఈరహదారి నిర్మించి ఏడాది కాలేదు. అప్పుడే గోతులు పడడంతో ప్రజలు,

ప్రయాణికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. గోతులు పడిన ఈప్రాంతంలో రాకపోకలకు అంతరాయంగా ఉంది. ప్రారంభంలోనే గోతులు పూడ్పించితే ఇబ్బంది తలెత్తదు. నిర్లక్ష్యంగా వదిలేస్తే గోతులు పెద్దవవుతాయి.అప్పుడు ప్రయాణికులు మరింత తీవ్ర ఇబ్బందులు పడతారు.సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్ ముఖాముఖి (1వ పేజీ తరువాయి)

రూ.500 ప్రకటించడం ఆమేరకు ఇరువురికి రైతులకు, కోకో పరిశ్రమ వారికి ఆమోదయోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. కోకో కంపెనీ ద్వారా రైతులకు కేజీకి రూ.500 అందచేస్తున్నామని, అందులో రాష్ట్ర ప్రభుత్వం కంపెనీ వారికి రూ.50లను తిరిగి ఇవ్వాలని నిర్ణయించిందని కలెక్టర్ ప్రశాంతి పేర్కొన్నారు. వాస్తవంగా జిల్లాలో అంతర్ పంటగా కోకో సాగు విస్తీర్ణం గుర్తించడం కోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసి, వాటి వివరాలు తెలుసుకోవడం జరిగిందన్నారు. కోకో సాగు విస్తీర్ణం వివరాలు ఈ క్రాప్ బుకింగ్ ఆధారంగా లెక్కించడం జరుగుతుందని వెల్లడించారు. కోకో రైతులు ఆమేరకు ఈ క్రాప్ బుకింగ్ చెయ్యకపోవడం వల్ల వివరాలు తెలుసుకోవడంలో జాప్యం చేసుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నల్లజర్ల మండలంలో సుమారు 457 ఎకరాల్లో అంతర్ పంటగా కోకో రైతులు సాగు విస్తీర్ణం ఉన్నట్లు అధికారులు కలెక్టర్ కి తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా హార్టికల్చర్ అధికారి బి.సుజాత కుమారి, ఏపీ ఎంఐపి పిడి ఎ. దుర్గేష్, స్థానిక హార్టికల్చర్ అధికారులు, రైతులు ఉన్నారు.

విజయవంతం చేయండి (1వ పేజీ తరువాయి)

ఆహ్వానం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తిబాబు పత్రికా ముఖంగా వివరించారు. పార్టీ ప్రజా సంఘాల విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 27 మధ్యాహ్నం 3 గంటలకు అమలాపురంలో నిర్వహించిపార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని, రవాణా రంగ సమస్యల పైన జిల్లా రవాణా జేఏసీ నేతలతో మంగళవారం ఉదయం 10 గంటలకు అమలాపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరుగుతుందని ఆ సమావేశాన్ని జయప్రదం చేయాలని సత్తిబాబు పిలుపు ఇచ్చారు.

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యం

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.

సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) ద్వారా జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి స్వీకరించారు.జిల్లా కలెక్టరుతో పాటు జిల్లా జాయింటు కలెక్టరు పి.ధాత్రిరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు,ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్ అర్జీలను స్వీకరించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 337 అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కారతీరు వుండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీ-ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు,రెవిన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల నిరసన

(1వ పేజీ తరువాయి)

విడుదల చేయాలని కోరారు. బదిలీలు సీనియారిటీ ఆధారంగా పారదర్శక పద్ధతిలో జరగాలని, సిఫార్సు లేఖలు లేదా ఇతర అనధికారిక కారణాల ప్రభావంతో కాదన్నారు. రెండు రోజుల్లో స్పష్టత లేనప్పుడు, ఉద్యోగులు పెన్-డౌన్ సమ్మెలు వంటి శాంతియుత నిరసన చేస్తామన్నారు. అనంతరం మునిసిపల్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు వార్డు సెక్రటరీలు, అడ్మినిస్ట్రేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాల విద్య

(1వ పేజీ తరువాయి)

57 మంది ఎస్.జి.టి.లు, 36 మంది స్కూల్ అసిస్టెంట్లు సర్‌ప్లస్‌గా మిగిలిపోయారు. వీరిలో 30 మంది ఎస్.జి.టి.లను స్థానిక ఏ ఆర్ డి జి కె క్లస్టర్ కాంప్లెక్స్‌కు అప్పగించారు. మరో 27 మందిని స్థానిక బిజిబిఓ హైస్కూల్లోని క్లస్టర్ కాంప్లెక్స్‌కు పంపించారు. ఆయా క్లస్టర్ల పరిధిలోని పాఠశాలలో ఉపాధ్యాయులు ఎవరైనా సెలవులు పెడితే వారి బదులుగా ఈ ఉపాధ్యాయులు విధులను నిర్వర్తించడానికి అధికారులు పంపిస్తారు. మిగిలిన రోజుల్లో వీరంతా తమకు కేటాయించిన క్లస్టర్ పాఠశాలల్లోనే హాజరు కావాల్సి ఉంటుంది. కార్పొరేషన్ పరిధిలో మిగిలిన 36 మంది స్కూల్ అసిస్టెంట్లను వివిధ క్లస్టర్ కాంప్లెక్స్ లకు అప్పగించారు.

లోపించిన అంకితభావం

ఏలూరు నగరంలో 50 డివిజన్లలో మొత్తం 39 ఏలూరు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలు, 3 మున్సిపల్ యూపీ స్కూల్స్, 7 కార్పొరేషన్ హైస్కూల్స్ ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 157 మంది ఎస్.జి.టి.లు, 167మంది స్కూల్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. యూపీ,హైస్కూళ్లలో కలిపి సుమారు నాలుగువేల మంది విద్యార్థులు, మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 1756 మంది 1 నుండి5 తరగతులు చదివే విద్యార్థులు ఉన్నారు. ప్రత్యేకించి ఎలిమెంటరీ బడులలో సింగిల్ డిజిట్ (పదిమంది విద్యార్థులు లోపు) స్కూళ్ళు 25 వరకు ఉంటాయని తెలుస్తోంది. మున్సిపల్ బడులలో చేరే విద్యార్థుల సంఖ్య అంతకంతకు ఇంత దారుణంగా పడిపోవడానికి కారణం...తిలా పాపం...తలా పిడికెడు...అని చెప్పకతప్పదు. లోపించిన అంకితభావం ,కానరాని చిత్తశుద్ధి, అశ్రద్ధ అందరిలోనూ కనిపిస్తోంది. నగర పాలక సంస్థ పాఠశాలలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య అసలే అంతంత మాత్రంగా ఉంది.

పాలకుల అవగాహనా రాహిత్యం

ముఖ్యంగా ప్రభుత్వాలు మారినప్పుడల్లా పాలకులు అవగాహన రాహిత్యంతో తమ సొంత ఎ జెండాలను అమలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారులు కూడా వీరికి వంత పాడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో సంగతి చెప్పనే అక్కర్లేదు. టాబ్ లు, టోఫెల్, ఇంగ్లీష్ మీడియం, తెలుగు మీడియం, సి.బి.ఎస్.ఈ,ఇంటర్నేషనల్ బకలారియట్ విధానం ద్వారా విద్య వంటి ఆచరణ సాధ్యం కాని అంశాలను ప్రవేశపెట్టారని అప్పట్లో విమర్శలు వచ్చాయి. పరీక్షలు, బోధన, అభ్యాసం తదితర విధానాలలో కూడా మితిమీరిన జోక్యం వల్ల విద్యారంగం పరిస్థితి చుక్కానీ లేని నావ వలె ఉందని పరిశీలకులు, విశ్లేషకులు అంటున్నారు. ఇప్పుడు తాజాగా తల్లికి వందనం పథకాన్ని ప్రైవేటు పాఠశాలలకు కూడా అమలు చేస్తున్నారు. రాబోయే రెండు మూడు నెలల్లో మున్సిపల్ బడుల నుంచి ప్రైవేట్ పాఠశాలలకు వలస వెళ్లే విద్యార్థుల సంఖ్య మరింత పెరుగు తుందని ఉపాధ్యాయ వర్గాల నుంచి ఆందో ళన వ్యక్తం అవుతుంది. మిగిలిన యాజమాన్యాల మాదిరిగానే మున్సిపల్ స్కూళ్లలో కూడా మౌలిక వసతులు ఏర్పాటు, మధ్యాహ్న భోజన పథకం అమలు, ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ, యూనిఫారాలు, టైలు, బెల్టులు, షూస్, తాగునీరు, టాయిలెట్ల సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ అడ్మిషన్లు గణనీయంగా పడిపోతుండటం పట్ల సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. దాదాపు అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో స్కూలు అసిస్టెంట్లు, ఎస్.జి.టి.లు, ఎం.టి. ఎస్.టీచర్లు అవసరాన్ని మించి ఉన్నారు. అన్నింటికన్నా ముఖ్యంగా ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయుల సంఖ్యే ఎక్కువగా ఉంటే డీ.ఎస్.సి. 2026 లో ఎంపికైన వారికి ఏ పాఠశాలలు కేటాయిస్తారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.ఇదే విషయంపై విద్యాశాఖ అధికారులను అనధికారికంగానైనా వివరణ కోరుతుంటే, మీరు అడగ కూడదు. .మేం చెప్పకూడదు.... అని దాటవేస్తున్నారంటే పాఠశాల విద్య రంగ పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వర్షాలతో ఏరువాక పనులు ముమ్మరం

విశాలాంధ్ర-లింగపాలెం: మెట్ట ప్రాంతంలో వరుసగా మూడు రోజులపాటు వర్షాలు పడటంతో ఏరువాక పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. జూన్‌లో 118 మి.మీ. వర్షం పడాల్సి ఉండగా ఈ నెల 19 నాటికి 22.4 మి.మీ.మాత్రమే వర్షం పడటంతో మెట్ట ప్రాంతపు రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారు. దీనికి తగ్గట్టుగా ఉష్ణోగ్రతలు అధికంగా

ఉండటంతో రైతన్నలు కలవరపాటుకు గురయ్యారు. ఇటువంటి సమయంలో ఈనెల 20,21, 22 తేదీలలో వరుసగా ఆశాజనకంగా వర్షాలు పడటంతో రైతన్నలలో ఆనందం నెలకొంది. మూడు రోజులలో 56.2 మి.మీ వర్షం పడింది. దాదాపు నాలుగున్నర దుక్కులు వర్షం పడటంతో రైతన్నలు వ్యవసాయ పనులలో నిమగ్నం అయ్యారు. మెట్ట ప్రాంతమైన లింగపాలెం, చింతలపూడి, కే.కోట మండలాల్లో పూర్తిస్థాయిలో నారులు పోసేందుకు వాతావరణం అనుకూలించిందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. బోరుల ఆధారంతో నార్లు పోసిన రైతులు నారులు సిద్ధమవ్వటంతో నాట్లు వేసేందుకు దుక్కులు దున్నుతున్నారు. దాదాపు 20వేల ఎకరాలలో నాట్లు వేసేందుకు నార్లు పోయటానికి వాతావరణం అనుకూలించిందని వ్యవసాయ అధికారులు వెల్లడించారు. ఈఏడాది ఖరీఫ్ సీజన్లో భారీ వర్షాలు పడటంతో విత్తనాలు చల్లే విధానంతో(కరేత)వరి పంట వేస్తున్నారు. పడిన వర్షం వల్ల ఇతర పంటలకు కూడా ప్రయోజనం కలిగిందని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఉద్యాన పంటలకు పడిన వర్షం ఉపయోగపడుతుందని వివరించారు.

గణపవారిగూడెం గ్రామ రెవెన్యూ అధికారికి సన్మానం

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలోని గణపవారి గూడెంలో రీసర్వేను విజయవంతంగా నిర్వర్తించినందుకు గ్రామ రెవెన్యూ అధికారి పగడం బాబును తహసీల్దార్ నజీముల్లాషా సన్మానించారు. గణపవారిగూడెంలోని 500 ఎకరాలలో రీసర్వే జరిగిందని తహసీల్దార్ వెల్లడించారు. రీసర్వేకు సంబంధించి గ్రామ రెవెన్యూ అధికారి బాబు సక్రమంగా బాధ్యతలు నిర్వర్తించటాన్ని తహసిల్దార్‌తో పాటు మండల స్థాయి రెవిన్యూ అధికారులు

అభినందించారు. ఈ సందర్భంగా ఈయన సేవలను కొనియాడుతూ సన్మానించి ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ లింగపాలెం మండలంలో ఏడు గ్రామాలలో రీసర్వే జరిగిందని దీనివల్ల దాదాపు 4వేల ఎకరాలలో వివాదాలు పరిష్కరించటంతో పాటు భవిష్యత్తులో ఎటువంటి భూములకు సంబంధించి వివాదాలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. మండలంలో జరిగిన రీసర్వే వల్ల రెండు వేల మంది రైతులకు ప్రయోజనం కలిగిందని వివరించారు. ఈ కార్యక్ర మంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నాగబాబు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, రెవిన్యూ ఇన్ స్పెక్టర్ మాణిక్యాలరావు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు శంకుస్థాపన

విశాలాంధ్ర- ఉండి : పేదవాడు కడుపు నింపుకునే బృహత్తర కార్యక్రమం అన్నా క్యాంటీన్ అని స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ ఉపసభాపతి కనుమూరి రఘురామ కృష్ణంరాజు అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ఉండిలో శాశ్వత అన్నా క్యాంటీన్ నిర్మాణానికి భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమానికి రఘురామ సోమవారం శ్రీకారం చుట్టారు. ఈ

సందర్భంగా రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ శాశ్వత అన్న క్యాంటీన్ రూ.61 లక్ష వ్యయంతో నిర్మించనున్నట్లు తెలిపారు. వచ్చే ఆగస్టు 15 కల్లా నిర్మాణం పూర్తి చేసుకొని పేదవారి ఆకలి తీర్చడానికి అందుబాటులోకి తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు కరిమేరక నాగరాజు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు వెంకటేశ్వరరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గాదిరాజు వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులను ప్రోత్సహించాలి

ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు

విశాలాంధ్ర-భీమవరం: ప్రతిభావంతులను ప్రోత్సహిస్తే మరింత రాణిస్తారని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్,ఎమ్మెల్యే పులపర్తి రామాంజ నేయులు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో డిగ్రీలో ఉత్తమ ర్యాంకులు సాధించిన భీమవరం శ్రీఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లోనూ ముందుంటున్నారని, అత్యధిక మార్కులు సాధించి దూసుకుని పోతున్నారని, కూటమి ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ మావుళ్ళు, చెరుకువాడ రంగసాయి, వబిలిశెట్టి రామకృష్ణ, మైగపుల గంగరాం, చల్లా రాము తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు

విశాలాంధ్ర-ఏలూరు: ఐ.టి.ఐ., పాలిటెక్నిక్,డిగ్రీ,పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతున్న 13 మంది విభిన్న ప్రతిభావంతులకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ల్యాప్ టాప్‌లను పంపిణీ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో రూ.4.68 లక్షల విలువైన ల్యాప్ టాప్ లను జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ చదువులో రాణిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. రెగ్యులర్ అర్హత కలిగిన విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ల్యాప్ టాప్ లు అందించి వారి విద్యకు దోహదపడుతుందన్నారు. దృష్టి లోపం,బధిరులు,చలన వైకల్యముకల విద్యార్థినీ, విద్యార్థులకు వీటిని అందజేయడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండల వైద్యాధికారిగా గులాబ్ రాజ్ కుమార్

విశాలాంధ్ర - పాలకోడేరు : పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారిగా ఎం. గులాబ్ రాజ్ కుమార్ సోమవారం బాధ్యత స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు వీరవాసరం మండలంలో పనిచేసి సాధారణ బదిలీలలో భాగంగా పాలకోడేరులో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ సిహెచ్. వి. రంగం నాయుడు కాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గులాబ్ రాజ్ కుమార్ గతంలో ఇదే మండలంలో పనిచేయడంతో మండల ప్రజలకు సుపరిచితులు. మరల ఇదే మండలానికి రావడంతో సిబ్బంది, ప్రజా ప్రతి నిధులు ఆయనకు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలియజేశారు.

నేటి నుంచి ఆక్వా రైతులకు గ్రామ సభలు

విశాలాంధ్ర - గణపవరం: ఆక్వా రైతులకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు గణపవరం మండల మత్స్యశాఖ అధికారి ఎన్ శివరామకృష్ణ తెలిపారు. ఈనెల 24వ తేదీన మండలంలో గణపవరం పిప్పర కేశవరం సరిపల్లి ముప్పర్తిపాడు జల్లి కాకినాడ కొత్తపల్లి గ్రామాల్లో జరుగుతాయన్నారు. 25వ తేదీన సిహెచ్ అగ్రహారం, ఎస్ కొండేపాడు, అప్పన్నపేట, జల్లి కొమ్మర, 26వ తేదీన మొయ్యేరు డీకె పల్లి, కోమర్రు వల్లూరు గ్రామాల్లో, 27 తేదీన జగన్నాధపురం, చిన్న రామచంద్రపురం, అర్ధవరం, మొగ్గుళ్ళు, ఏ గోపవరం గ్రామాల్లో గ్రామసభలు జరుగుతాయని ఆయన తెలిపారు. వివరాలకు గ్రామాల్లో ఉన్న మత్స్యశాఖ సహాయకులను సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఆటోనగర్ అభివృద్ధికి సీపీఐ పోరాటం

విశాలాంధ్ర-ఏలూరు: ఆటోనగర్ అభివృద్ధికి సీపీఐ అలుపెరుగని పోరాటం చేస్తుందని సీపీఐ ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) ఏలూరు ఏరియా మహాసభలలో 2వసారి ఏరియా కార్యదర్శిగా ఎన్నికైన ఉప్పులూరి హేమశంకర్ ను ది ఏలూరు టౌన్ ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఎన్నో ఏళ్ళుగా ఆటోనగర్‌లో జరుగుతున్న అవినీతి,అక్రమాలపై మాజీ అధ్యక్షుడు మాగంటి నాగభూషణం చేసిన అరాచకాలపై పోరాటాలను నిర్వహించిందని తెలిపారు. అనంతరం అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పడిన సందర్భంలో జరిగిన అనేక సందర్భాల్లో సీపీఐ ప్రత్యక్షంగా పాల్గొని నూతన కమిటీకి సంఘీభావాన్ని మద్దతును తెలియజేసిందని వివరించారు. భవిష్యత్తులో నూతన కమిటీని ఇబ్బంది పెడుతున్న మాజీ అధ్యక్షులు మాగంటి నాగభూషణం చర్యలకు వ్యతిరేకంగా, ఆటోనగర్ అభివృద్ధి లక్ష్యంగా, అసోసియేషన్ కమిటీకి ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు అరుణతార నాగేశ్వరరావు, కార్య దర్శి అడపా సత్యనారాయణ, గౌరవాధ్యక్షులు మహమ్మద్ సులేమాన్, ఉపాధ్యక్షులు కర్రి ఈశ్వరరావు, కమిటీ సభ్యులు షేక్ జిల్ఫీ,సిగిరెడ్డి సంజీవరావు, సయ్యద్ చోటే, చిట్యాల పూర్ణచంద్రరావు, ది ఏలూరు కార్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షులు మహబూబ్ షరీఫ్, సీపీఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సభ్యురాలు మావూరి విజయ తదితరులు పాల్గొన్నారు.

శాఖ కార్యదర్శుల ఎన్నిక

విశాలాంధ్ర- ఉండి : మండల కేంద్రమైన ఉండిలో ఫ్రూట్ జ్యూస్, ఆటో యూనియన్ శాఖ సమావేశాలు స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా సమితి సభ్యులు సనపల శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ఫ్రూట్ జ్యూస్ శాఖ కార్యదర్శిగా చీమల నరసింహమూర్తి ,సహాయ కార్యదర్శిగా ఎన్ని ప్రసాదు, ఆటో యూనియన్ శాఖ కార్యదర్శిగా బొండాడ నాగరాజు, సహాయ కార్యదర్శిగా యండమూరి ప్రసాద్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా కాసాని సత్యనారాయణ, సెంటు వెంకటేశ్వరరావు, గుడ్ల వీరస్వామి, జూపూడి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ సమావేశాలకు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం. సీతారాం ప్రసాద్ హాజరై మాట్లాడారు. చిల్లర వ్యాపారస్తులు వ్యాపారాలు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిల్లర వర్తకులకు ప్రభుత్వం సబ్సిడీ రాయితీలు ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ ఆటో కార్మికుల పరిస్థితి దిన దిన గండం నూరేళ్ళ ఆయుషుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కిరాయిలు లేక కాలం వెళ్లదీస్తున్నారని పేర్కొన్నారు. ఆటో వారికి పూట గడవడమే గగనమైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం ఆటో వారిని, ఫ్రూట్ జ్యూస్ చిల్లర వర్తకులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్ల స్థలాలు ఇంటి నిర్మాణానికి రూ ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు కోన గొల్లయ్య, పార్టీ సానుభూతిపరులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పారిశుధ్యం పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాలసూర్య నారాయణరాజు (సూరిబాబు) తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ దారబోయిన లక్ష్మీ అధ్యక్షతన సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూరిబాబు ఆయా శాఖల అధికారులతో చర్చించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆయన సూచించారు. దోమల మందు పిచికారి చేయించాలని తెలిపారు. పంచాయతీల పరిధిలో త్రాగునీటి పైపు లైన్ ల లీకేజీలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జి.నగరాజ కుమారి, చింతలపూడి మలేరియా వైద్యులు ప్రసాద్, ఆయా శాఖల మండల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కు సంబంధించి అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టి, ప్రతి అర్జీకి చక్కని పరిష్కారం చూపాలని అధికారులను జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డితో కలసి జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్జీని ఆడిటింగ చేయడం జరుగుతుందని, ప్రజల నుండి అందే ప్రతి అర్జీని నిర్దిష్ట సమయం లోపుగానే పరిష్కరించాలన్నారు. సమావేశంలో డిఆర్డిఏ, పిడి ఎం. ఎస్. ఎస్. వేణుగోపాల్ వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జెడ్. వెంకటేశ్వరరావు, డి ఎం అండ్ హెచ్ ఓ జి.గీత భాయి, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, మున్సిపల్ కమిషనర్ కె.రామ చంద్ర రెడ్డి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూతపడ్డ కుట్టు మిషన్ కేంద్రాన్ని తెరిపించండి

ఎంపీడీవోకు మహిళల వినతి

విశాలాంధ్ర- ఉంగుటూరు : మహిళలు ఎవరిపై ఆధారపడ కుండా స్వశక్తిపై జీవించాలన్న ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో ఉచిత కుట్టు మిషన్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. దానిలో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ 10వ తేదీన ఉంగుటూరు పాత సచివాలయం కార్యాలయం వద్ద ఉచిత కుట్టు మిషన్ కేంద్రాన్ని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్స మట్ల ధర్మరాజు ప్రారంభించటం పాఠకులకు విదితమే. ప్రారంభించిన నాటి నుంచి కేవలం 15 రోజుల మాత్రమే కుట్టు శిక్షణ జరిగింది. తర్వాత కుట్టు మిషన్ కేంద్రం మూతపడింది. కుట్టు మిషన్ కేంద్రాన్ని తెరవాలని కోరుతూ మహిళలు సోమవారం కుట్టు మిషన్ కేంద్రం నుండి ర్యాలీగా వెళ్లి స్థానిక ఎంపీడీవో గంజి రాజు మనోజ్‌కు వినతిపత్రం సమర్పించారు. మూతపడ్డ కుట్టు మిషన్ కేంద్రాన్ని తెరిపించి తమకు శిక్షణ ఇప్పించాలని కోరారు. మీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, కుట్టు మిషన్ కేంద్రాన్ని తెరిపిస్తానని ఎంపీడీవో అన్నారు. తొలుత మహిళలు మండల పరిషత్ కార్యాలయం ఎదుట కుట్టు మిషన్ కేంద్రం తెరిపించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు.

శిక్షణ కేంద్రంలో ఏమీ లేవు

ఉచిత కుట్టు మిషన్ కేంద్రంలో మహిళలు నేర్చుకోవడానికి ఏమీ లేవు. టైలరింగ్ నేర్చుకోవడానికి సంబంధించి ఏ సౌకర్యం కల్పించలేదు. మొక్కుబడిగా ఉచిత శిక్షణ కేంద్రంగానే ఉంది. శిక్షణకు వచ్చే మహిళలను కింద కూర్చోబెట్టి తూతూ మంత్రంగానే శిక్షణ ఇచ్చారు. శిక్షణ కేంద్రంలో కూర్చోవడానికి బెంచీలు లేవు, టైలరింగ్ నేర్చుకోవటానికి మెటీరియల్ లేవు. ఈ సమస్యలన్నీ తనకు తెలుసని ఎంపీడీవో మనోజ్ వచ్చిన మహిళలకు వివరించారు. శిక్షణ కేంద్రంలో అన్ని సౌకర్యాలు ఉండే విధంగా జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

జిల్లా విజిలెన్స్ సమావేశం ఏర్పాటులో జాప్యం

విశాలాంధ్ర- ఉండి : జిల్లా విజిలెన్స్ సమావేశం ఏర్పాటు చేయడంలో జిల్లా అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఎండగండి వినియోగదారుల సంఘం అధ్యక్షులు టీవీఎస్ గోపాలకృష్ణరాజు విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా విజిలెన్స్ కమిటీ ఏర్పాటు చేసినప్పటికీ జిల్లా కమిటీలు వేయటంలో అధికారులు తాత్సారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆరు నెలలకు ఒక్కసారి వెయ్యవలసిన కమిటీ ఊసే లేకపోవడం దారుణం అన్నారు. వెంటనే విజిలెన్స్ కమిటీ వేయాలని గోపాలకృష్ణంరాజు విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధి కాగితాలపైనే...ఆచరణలో శూన్యం

నూజివీడు పట్టణ సీపీఐ మహాసభలో చలసాని రామారావు

విశాలాంధ్ర-నూజివీడు : ప్రభుత్వాల విధానాలు పేదలకు వ్యతిరేకంగా ఉంటున్నాయని, అభివృద్ధి కాగితాల పైనే కానీ ఆచరణలో ఉండడం లేదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు పేర్కొన్నారు. నూజివీడు పట్టణ సీపీఐ మహాసభ సోమవారం స్థానిక పార్టీ కార్యాలయం అమర్‌భవన్లో పార్టీ నాయకులు శిఖ ఆకాష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న రామారావు మాట్లాడుతూ దేశంలో కార్మిక కర్షక వర్గాలు సంపద ఉత్పత్తి కేంద్రాలుగానే మారిపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలు పేదలకు వ్యతిరేకంగా ఉంటున్నాయని, సంక్షేమ పథకాల మాయలో పెట్టి ప్రజలను ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా వందేళ్లుగా దేశ ప్రజల సమస్యల పట్ల కమ్యూనిస్టులు పోరాటాలు చేస్తున్నారని, అనేకమంది కమ్యూనిస్టులు ప్రాణ త్యాగాలు చేశారన్నారు. ప్రభుత్వాల విధానాల వల్ల దేశంలో కోటీశ్వరులు పెరిగారని అదే స్థాయిలో పేదలు పెరిగిపోతున్నారన్నారు. 11 ఏళ్ల మోదీ పాలనలో ప్రజలపై భారాలు తప్ప మరొకటి లేదన్నారు. ట్యాక్స్‌ల పేరుతో ప్రజల జేబులకు చిల్లులు పెడుతున్నారని విమర్శించారు. సంపదను సృష్టిస్తున్న కార్మిక వర్గాన్ని ఆదుకోవాల్సిందిపోయి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని పేర్కొన్నారు. కార్మిక వర్గం ప్రాణాలు ఫణంగా పెట్టి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడ్ లుగా మార్చి యాజమాన్యానికి లాభం చేసే విధంగా ప్రభుత్వాల విధానాలు ఉన్నాయన్నారు. అన్ని రంగాల్లోనూ సామాన్య, మధ్యతరగతి ప్రజలు దోపిడీకి గురవుతున్నారని, ప్రజల మధ్య వివక్షతను సృష్టించి ప్రభుత్వాలు తమ పబ్బం గడుపుతున్నాయన్నారు. ఏఐటీయూసీ నూజివీడు నియోజకవర్గ అధ్యక్షులు అక్కినేని ఆంజనేయ ప్రసాద్ మాట్లాడుతూ అధికారం ఉన్నా లేకున్నా కమ్యూనిస్టులు పేదలపక్షమన్నారు. సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్య నూజివీడు పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు మాట్లాడుతూ ఈనెల 27న జరిగే నూజివీడు నియోజకవర్గ ఏరియా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి మడిపల్లి నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ పట్టణ కార్యదర్శిగా చాట్ల పుల్లారావు

సీపీఐ పట్టణ నూతన కార్యదర్శిగా చాట్ల పుల్లారావు మరోసారి ఎన్నికయ్యారు. పుల్లారావు తో పాటు మరో 15 మంది సమితి సభ్యులుగా మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

మహాసభ తీర్మానాలు :

నూజివీడు పట్టణంలోని రహదారులను అభివృద్ధి పరచాలని, గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన టిట్కో ఇళ్లను ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం త్వరితగతిన లబ్ధిదారులకు అందించాలని, కార్మికులకు 26 వేల వేతనాన్ని అమలు చేయాలని, నూజివీడు లో ఉన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పలు తీర్మానాలను మహాసభ ఆమోదించింది.

శాంతి భద్రతల పరిరక్షణలో డ్రోన్ వ్యవస్థ కీలక పాత్ర : ఎస్పీ వెల్లడి

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ మానిటరింగ్, విపత్తు నిర్వహణ, నిఘా చర్యల్లో డ్రోన్ వ్యవస్థ ఎంతగానో ఉపయోగ పడుతుందని ఏలూరు జిల్లా ఎస్పీ కే.ప్రతాప్ శివ కిషోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ శాఖకు నూతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన డిజెఐ ఎయిర్ 3ఎస్ డ్రోన్ ను కేకేఆర్ గౌతమ్ స్కూల్స్ జనరల్ మేనేజర్ జాస్తి వెంకటేశ్వరరావు సోమవారం స్థానిక డిపిఒ కార్యాలయంలో ఎస్పీ కిషోర్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రోన్ వంటి ఆధునిక పరికరాలు పోలీస్ శాఖకు నూతన శక్తిని అందిస్తాయని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణకు నేరాల నిరోధానికి వ్యవస్థ ఎంతో దోహదపడుతుందని, అటువంటి సాంకేతిక పరిజ్ఞానం అందించిన గౌతమ్ స్కూల్స్ యాజమాన్యాన్ని ఎస్పి అభినందించారు. ప్రజల సేవలో ఎల్లప్పుడూ ముందుండే పోలీస్ శాఖకు సమాజం నుంచి ఇలాంటి సహకారం మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని ఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డిఎస్పీ కెవివిఎన్వి ప్రసాద్, గౌతమ్ స్కూల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

25న వికలాంగులకు మెగా ప్లేస్మెంట్ డ్రైవ్

విశాలాంధ్ర -భీమవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25వతేదీన నిరుద్యోగ వికలాంగుల యువతకు ఆర్.ఆర్. డి.ఎస్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించే మెగా ప్లేస్మెంట్ డ్రైవ్ సద్వినియోగం చేసుకోవాలని డిఆర్ఒ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. ప్లేస్మెంట్ డ్రైవ్ గోడ పత్రికను ఆయన కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లేస్మెంట్ డ్రైవ్‌లో సుమారు 13 ప్రముఖ కంపెనీలతో పాటు మరికొన్ని ఇతర కంపెనీలలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. వివిధ కంపెనీల్లో మొత్తం 400లకు పైగా ఉద్యోగావ కాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. 18-35 సంవత్సరాల వయస్సు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని కంపెనీల నియమా లను అనుసరించి ఎంపిక చేస్తారని, నిరుద్యోగ యువతీ యువ కులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు నైపుణ్యం.ఎపి.గవ్.ఇన్ లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మరిన్ని వివరాలకు 94414841622, 9502024765 నెంబర్లలో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ నైపుణ్య అభివృద్ధి అధికారి పి. లోకమాన్, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, గ్రామ వార్డు సచివాలయం అధికారి వై. దోసి రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా బోధనలో వినూత్న మార్పులు తేవాలి

విశాలాంధ్ర -భీమవరం: విద్యార్థులు లక్ష్యాలను చేరుకునేలా విద్యా బోధనలో వినూత్న మార్పులు తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని మధురై త్యాగరాజ ఇంజినీరింగ్ కళాశాల డీన్ డాక్టర్ ఎస్.భాస్కర్ అన్నారు. ఎస్.ఆర్.కె.ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో అవుట్ కం బేస్ట్ ఎడ్యుకేషన్ ఇన్ ది రివైజ్ ఎన్ బీ ఏ టైర్ వన్ ఫ్రేమ్ వర్క్ పేరిట రెండు రోజులు పాటు నిర్వహించే వర్క్ షాప్ ఆయన సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రాజేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ ఈ విద్యా విధానంలో టీచింగ్ లెర్నింగ్ లో లక్ష్యాలు సాధించే దిశగా మార్పులు జరగాలని స్పష్టంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.మురళి కృష్ణంరాజు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలు జయప్రదం చేయాలి

విశాలాంధ్ర- చింతలపూడి: భారత కమ్యూనిస్టు పార్టీ ఏలూరు జిల్లా మహాసభలు జూలై 5, 6, 7 తేదీలలో చింతలపూడిలో జరుగుతున్న సందర్భంగా జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం చింతలపూడి పట్టణంలో షాప్ టు షాప్ కర పత్రాల పంపిణీ, నిధి కార్యక్ర మాన్ని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు మామిళ్ళపల్లి వసంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఏలూరు జిల్లా రెండవ మహాసభలు చింతలపూడి పట్టణంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని మొదటి రోజు 5000 మందితో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల కోసం పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీ మహాసభల జయప్రదానికి చింతలపూడి పట్టణ ప్రజలంతా విరాళాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు పుల్లూరు సోమశేఖర్, మండల కార్యదర్శి తొర్లపాటి బాబు, సహాయ కార్యదర్శి దంతా కృష్ణ, తొర్లపాటి రాజు,ముళ్ళ గిరి అలెగ్జాండర్, ముల్ల గిరి లాజరు,మోర్తా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆమెన్ ట్రస్ట్‌చే కళ్లజోళ్ల పంపిణీ

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అసమాన ప్రజాసేవ చేసే వ్యక్తులు, సేవా సంస్థలకు అందే అరుదైన గౌరవ సత్కారం.. అది కూడా ఐక్యరాజ్యసమితి ప్రజాసేవా దినోత్సవం నాడు... ప్రజలందరి సమక్షంలో అందుకున్న ఘనత స్వచ్ఛంద సేవా సంస్థ ఆమెన్ ట్రస్ట్ కు దక్కింది. నిత్యం గ్రామీణుల సేవలోనే పరితపించే స్వచ్ఛంద సంస్థ ఆమెన్ ట్రస్ట్ ఎప్పటిలానే సోమవారం ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం అంకాలగూడెం గ్రామంలో 36 మంది పేదలైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు, స్వచ్ఛంద సేవకులు జీవీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రజాసేవా దినోత్సవం గురించి వివరించారు . ఆమెన్ ట్రస్ట్ నిర్వాహకులు, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇవాంజలిన్ అశోక్‌లను సత్కరించారు. ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో గ్రామీణులకు తమ వంతు సేవ చేసేందుకు ఆమెన్ ట్రస్ట్ అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవకులు కూనపాం రాజారత్నం, చాంద్ర చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

విశాలాంధ్ర -భీమవరం: జూలై 5న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులను రాజీ చేయాలని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, ఫోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ అన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో కేసుల రాజీకి తీసుకోవలసిన చర్యలపై సోమవారం న్యాయమూర్తి పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి పోలీసు స్టేషన్ లో ఎన్ని రాజీపడదగ్గ కేసులు ఉన్నాయి, ఎన్ని కేసుల వరకూ రాజీ అవుతాయి అనే వివరాలను పోలీసు అధికారుల నుండి అడిగి తెలుసుకున్నారు. ఎక్కువ కాలం నుండి పెండింగ్‌లో ఉన్న కేసుల రాజీకి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సివిల్ జడ్జి ఎం.సుధారాణి, 1వ అదనపు మొదటి తరగతి మేజిస్ట్రేట్ వి.హనీష, 2వ అదనపు మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎన్.జ్యోతి, బెంచ్ కోర్టు మేజిస్ట్రేట్ నాగరాజు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.సుజాత, భీమవరం వన్ టౌన్, టూటౌన్, రూరల్, ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు, భీమవరం వన్ టౌన్, టూటౌన్, రూరల్, ఎక్సైజ్, ఆకివీడు, ఉండి, కాళ్ళ, వీరవాసరం, పాలకోడేరు సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీసు కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

స్వేచ్ఛ సేవా సంస్థకు ఎంఆర్సీ కాలనీ వాసుల ధన్యవాదాలు

విశాలాంధ్ర-టి నరసాపురం: బొర్రంపాలెం గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన స్వచ్ఛ సేవా సంస్థ చారిటబుల్ ట్రస్ట్ అధినేత పెండ్యాల అభిషేక్ బాబుకు మండలంలోని బొర్రంపాలెం ఎంఆర్సీ కాలనీ వాసులు సోమవారం ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఆర్సీ కాలనీలో సుమారు 15 కుటుం బాలు ఇళ్లను నిర్మించుకుని నివాసం ఉంటు న్నామని, గడిచిన మూడు సంవత్సరాలుగా అక్కడే పిల్లాపాపలతో జీవిస్తున్నామన్నా రు. తమకు కనీస అవసరాలైన త్రాగు నీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని నాయకులు, అధికారుల దృష్టికి ఎన్నో మార్లు తీసుకెళ్లినా తమను ఏ ఒక్కరు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పెండ్యాల మల్లిబాబు తనయుడు స్వచ్ఛ సేవా సంస్థ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, పారిశ్రామిక వేత్త పెండ్యాల అభిషేక్ బాబును కలిసి కాలనీలో తాము పడుతున్న ఇబ్బందులు చెప్పడంతో ఆయన సానుకూలంగా స్పందించ డమే కాకుండా ఆయన ఆర్థిక సహాయంతో యుద్ధప్రాతిపదిన మంచినీటి పైపులు వేయించి తమ సమస్యను పరిష్కరించారని వారు తెలిపారు. కాలనీ వాసుల సమస్యలు పరిష్కారానికి స్పందించి తమవెంట ఉన్న బత్తుల రమేష్, కొనకళ్ళ సర్వేశ్వరరావు, పల్లా రమేష్, కంభంపాటి జోగేశ్వరరావు, రాజబోయిన రమేష్, గుండె పాండురంగ, గుండె చిట్టియ్య తదితరులకు వారు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

విశాలాంధ్ర -భీమవరం: ఇండస్ట్రియల్ ఏరియా విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ తీగల మార్పిడి నిమిత్తం మంగళవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. నరసయ్య అగ్రహారం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు

జనన మరణాల నమోదు నూరు శాతం జరగాలి

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : జనన మరణాల నమోదుకు సంబంధించిన అప్లికేషన్లు ఎక్కడా కూడా పెండింగ్ లేకుండా నూరు శాతం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, కమిషనర్ (FAC) పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పబ్లిక్ హెల్త్ విభాగాన్ని సోమవారం కలెక్టర్ పరిశీలించారు. ఎంత మంది ఉద్యోగులు, సిబ్బంది ఉన్నది అడిగి తెలుసుకున్నారు. అర్జీదారులతో మాట్లాడారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. సర్టిఫికెట్ల జారీకి ఎంత సమయం పడుతున్నదో వివరాలు సేకరించారు. డ్యాష్ బోర్డును పరిశీలించి.. పెండింగ్ అప్లికేషన్స్ పై ఆరా తీశారు. 2023లో సవరించిన జనన మరణాల నమోదు చట్టం ప్రకారం అప్డేటెడ్ సిఆర్ఎస్ పోర్టల్ ద్వారా జనన ధృవీకరణ పత్రాల్ని పొందాల్సి ఉంటుందని కలెక్టర్ అన్నారు. డెత్ సర్టిఫికెట్ల జారీకి సంబంధించి మరణానికి గల కారణాన్ని తప్పక నమోదు చేయాలన్నారు. అత్యంత సరళీకృతంగా ధృవీకరణ పత్రాల జారీకి అధికారులు కృషిచేయాలని సూచించారు. జనన, మరణ ధృవీకరణ పత్రాల కోసం ఏ ఒక్కరూ ఇబ్బందిపడకూడదని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట అడిషనల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎంహెచ్ఓ వినూత్న, ఎస్ఈ(ఇంజనీరింగ్) ఎం.సీహెచ్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మునిసిపల్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, కమిషనర్(ఎఫ్ఏసీ) పి.ప్రశాంతికి యూనియన్ సభ్యులు విన్నవించారు. ఈ మేరకు సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వర్కర్లకు జీతం పెంపుతో పాటు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. ఆప్కాస్ లో ప్రభుత్వ ఉద్యోగి అని చూపడం ద్వారా ప్రస్తుతం వారికి ఏ సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతామని తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - కడియం : మండల కేంద్రమైన కడియం గ్రామం శెట్టిబలిజ పేటలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వెంటనే ఆ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శ్రీరామలక్ష్మీగణపతి శెట్టిబలిజ సంఘం సభ్యులు స్థానిక ప్రజలతో కలిసి, కడియం తహసీల్దార్ కార్యాలయం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా తమ పేటలోని రోడ్డు, డ్రైనేజీ, కరెంటు వైర్లు తదితర సమస్యల గురించి పట్టించుకునేవారు లేరన్నారు. రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా తయారయ్యాయని వాపోయారు. తమ రోడ్డులో లారీలు, స్కూలు బస్సులు కూడా తిరగడానికి లేకుండా, కరెంట్ తీగలు చేతికి అందే అంత ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. వెంటనే తమ పేటలో కొత్త కరెంటు స్థంబాలు వెయ్యాలని అదేవిధంగా తమ పేట సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కడియం ఎంపిపి, ఎమ్మార్వో, ఎలక్ట్రికల్ ఏఈ, గ్రామపంచాయతీ ప్రెసిడెంట్, సెక్రటరీలకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. అధికారులు సానుకూలంగా స్పందించి, సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీ రామలక్ష్మి గణపతి శెట్టిబలిజ సంఘం సభ్యులు తెలిపారు.

పీహెచ్‌సీల నిర్మాణాలు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - సీతానగరం/రాజానగరం: రాజానగరం నియోజకవర్గంలో పిహెచ్‌సీ నిర్మాణాలు పూర్తి చేయాలని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరారు. సోమవారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అమరావతి పర్యటనలో భాగంగా వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఎం. టి.కృష్ణబాబుని కలిసి రాజానగరం నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సహకరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీతానగరం మండలంలో బొబ్బిల్లంక గ్రామంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనానికి రూ. 237 లక్షల అంచనా వ్యయంతో మంజూరైన నిర్మాణ పనులకు సంబంధించి చెల్లింపులు చేయని కారణంగా నిర్మాణం నిలిచిపోయినట్లు వివరించారు. ఈ పీహెచ్‌సీ నిర్మాణం పూర్తి చేయడం ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ సమస్యను గతంలో అనేకసార్లు లేఖల ద్వారా తెలియజేశామని గుర్తుచేశారు. ప్రాజెక్టు యొక్క ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, నూతన సిఎఫ్ఎమ్ ఎస్ఐడి ద్వారా బకాయి చెల్లింపులను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే పెరుగుతున్న జనాభా దృష్ట్యా రాజానగరం నియోజకవర్గానికి 6 అదనపు 108 అంబులెన్స్‌లు మంజూరు చేయాలని కోరారు. ఇంకా శ్రీకృష్ణపట్నం, గాదరాడ గ్రామాల్లో నూతన పీహెచ్‌సీల నిర్మాణాలకు అనుమతి మంజూరు చేయాలని కోరారు. ఈ విషయాలపై సానుకూలంగా స్పందించిన ఎం. టి.కృష్ణబాబు ఐఏఎస్ వీలైనంత త్వరలో అనుమతులు మంజూరు చేసి, త్వరలోనే నిర్మాణాలు చేపట్టి త్వరగా పూర్తి చేయడానికి సహకరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

క్షయ వ్యాధి నివారణే లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అనపర్తి : భారతదేశాన్ని క్షయ వ్యాధి నుండి విముక్తి చేయాలని లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రారంభించిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో టీబీ ముక్త్ భారత్ పోస్టర్ ఎమ్మెల్యే నల్లమిల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగులకు డాక్టర్లు అవగాహన కల్పించి టీబీ నివారించాలని కోరారు. అనంతరం ఏరియా ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ చైర్మన్, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న నూతనంగా నియమితులైన సివిల్ సర్జన్, జనరల్ మెడిసిన్, చర్మ వ్యాధులు, ఎముకల వైద్యనిపుణులు, నర్సింగ్ సూపరింటెండెంట్, హెడ్ నర్సు, 11 మంది స్టాఫ్ నర్సులకు ఎమ్మెల్యే నల్లమిల్లి నియామక పత్రాలు అందజేశారు. జిల్లాలో మొట్టమొదటిసారిగా ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబరేటరీ ల్యాబ్ ఎమ్మెల్యే మంజూరు చేయించడం జరిగిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాటి రామ గుర్రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపి అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), మేడపాటి సత్యనారాయణరెడ్డి (అన్నవరం), సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ తరుణ్, ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

విదేశాల్లో నర్సింగ్ సేవలు అందించేందుకు శిక్షణ దోహదం

విశాలాంధ్ర - రాజానగరం : అంతర్జాతీయ స్థాయిలో వైద్య నర్సింగ్ సేవలు అందించేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయని జీఎస్ఎల్ విద్య సంస్థలు అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్ డిసి), స్కిల్‌బీ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాల ప్రాంగణంలో జర్మన్‌భాష శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన జీఎస్ఎల్ అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు సోమవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా జర్మనీ భాష నైపుణ్య శిక్షణకు 50 మంది నర్సులు ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర భాషల్లో నైపుణ్యం సాధించడం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయన్నారు. అంతర్జాతీయ స్థాయి వైద్య సేవలు ఉద్యోగాలకు సిద్ధం చేయడం ఈ శిక్షణా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అగ్రదేశాల్లో ఒకటైన జర్మన్ వంటి దేశంలో విదేశీ ఉద్యోగ అవకాశాలను పొందేందుకు నర్సులకు మార్గం సుగమనం అయిందన్నారు. ఇటువంటి శిక్షణా తరగతులు నిర్వహించడం, భాషా అభ్యాసాన్ని ఉపయోగించుకుని ప్రతిభను చాటుకోవాలని తద్వారా ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఏపీఎస్ఎస్డిసి, స్కిల్‌బీ సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ శిక్షణ తరగతులు విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్ఎల్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గీతా ప్రవీణా , ఏపీఎస్ఎస్డిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోహర్, ప్రాంతీయ ఉపాధి అధికారి టి.అనిల్ ,జిల్లా ఉపాధి అధికారి జి.హరిశ్చంద్ర ప్రసాద్, ఏపీఎస్ఎస్డిసి ప్రోగ్రాం ఇంచార్జి మేనేజర్, బి.సాయికృష్ణ ,జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వివిజి.మురళి, రాజానగరం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రామ్ భాస్కర్ , స్కిల్‌బీ వ్యవస్థాపకులు ఉజ్వల్ చౌహాన్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు సొమ్ములు విడుదల చేయాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: ధాన్యం కొనుగోలు సొమ్ములు ప్రభుత్వం వెంటనే విడుదల చేసి తమను ఆదుకోవాలని దేవరపల్లి గ్రామానికి చెందిన 15 మంది సన్న చిన్న కారు రైతులు సోమవారం సాయంత్రం తహసీల్దార్ ఎం శ్రీనివాసుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాము రెండు నెలల క్రితం దేవరపల్లిలో గల వరలక్ష్మి రైస్ మిల్లుకు ప్రభుత్వం ద్వారా ధాన్యం అందజేశామన్నారు. తాము ధాన్యం అమ్మి 2 నెలలు పైన అవుతుందన్నారు ఇప్పటివరకు ప్రభుత్వం జమ చేయలేదని అన్నారు. మరలా వరి నాట్లు వేసే సమయం వచ్చిందని నాట్లు వేయటానికి పెట్టుబడి పెట్టడానికి తాము ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ప్రభుత్వం వెంటనే తమకు సొమ్ములు జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇదేవిధంగా మండల వ్యవసాయ అధికారికి కూడా వినతిపత్రం అందజేశామని రైతులు తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ మీ సమస్యను ఉన్నతాధి కారుల దృష్టికి తీసు కెళ్లానన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు చెల్లింకి వెంకటేశ్వరరావు, కానూరి నాగరాజు, చిట్లు దుర్గారావు, చిట్లు పటేల్ , గన్నమని సత్యనారాయణ, తోలేటి శ్రీను , సి హెచ్ వి ఆర్ జె రాజు, నక్క చిరంజీవి, డివి రాజేష్, జి వెంకట్రావు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీలో అంగన్వాడీలను మినహాయించాలి

విశాలాంధ్ర-దేవరపల్లి: అంగన్వాడీలను సామాజిక పెన్షన్ల పంపిణీ విధులు నుండి మినహాయించాలని ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు టి పి లక్ష్మి సిఐటియు మండల కార్యదర్శి ఎస్ భగత్ అధికారులను కోరారు సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఎండిఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం ఇన్చార్జ్ ఎండిఓ రాజారావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కుమారి ఈ పి పద్మ కామేశ్వరి కే సులోచన ఎం అనురాధ ఉండవల్లి మంగతాయారు కే భవాని వి కాంచన పి నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు

దేశ రక్షణకు ముఖర్జీ సేవలు

విశాలాంధ్ర - అనపర్తి : జనసంఘ్ వ్యవస్థాపకులు, మానవతావాది, దేశం కోసం దేశ రక్షణ కోసం అనేకమైన సేవలు చేసినటువంటి గొప్ప మహా నాయకులు శ్యాం ప్రసాద్ ముఖర్జీ అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం రామవరంలో అఖండ భారతావని నినాదాన్ని ఎలుగెత్తి చాటిన శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి ఎమ్మెల్యే నల్లమిల్లి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కర్రి బుల్లిరెడ్డి, సర్పంచులు గొల్లు హేమ తులసి, గిరడా గంగాభవాని, పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూటకపు వాగ్దానాలతో మోసం

విశాలాంధ్ర - అనపర్తి : ఎన్నికల ముందు కూటమి నాయకులు బూటకపు వాగ్దానాలు చేసి ఎన్నికల తర్వాత ఎగనామం పెట్టారని అందుకే ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని వైసీపీ పోరాటం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం రాజమహేంద్రవరం కలెక్టర్ కార్యాల యం వద్ద నిర్వహించిన యువత పోరుకి రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి నల్లమిల్లి విజయా రెడ్డి, నియోజకవర్గ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు పడాల దుర్గా రెడ్డి ఆధ్వర్యంలో ద్విచక్ర,ఫోర్ వీల్స్ వాహనాల పై బయలుదేరగా మాజీ ఎమ్మెల్యే సత్తి జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, ప్రతి నిరుద్యోగికి ప్రతి నెలా నిరుద్యోగ భృతి రూ. 3 వేలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ళ కృష్ణారెడ్డి,ఉప సర్పంచ్ సబ్బెళ్ళ నాగిరెడ్డి పె వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెన్షన్ విధులు నుంచి మినహాయింపు ఇవ్వాలి

విశాలాంధ్ర - సీతానగరం: పెన్షన్ విధులు నుంచి మినహాయింపు ఇవ్వాలని వెల్ఫేర్ అసిస్టెంట్లకు బయట మండలాలకు బదిలీల వద్దు అంటూ ఎంపిడిఓ ఎమ్ భారతికి వినతిపత్రం సమర్పించారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్లు, మండల వెల్ఫేర్ అసిస్టెంట్లు వారి సమస్యలపై వినతి పత్రం యిచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని గ్రామాల అంగన్వాడీ సిబ్బంది, అన్ని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ముగిసిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర- పెరవలి : గత నెల రోజులుగా జరుగుచున్న గ్రామీణ ప్రీమియర్ క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిసాయి. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి వ్యాపారవేత్త వైనాట్ గ్రూప్ వ్యవస్థాపకులు జుజ్జురపు వెంకటరాయుడు, సమిశ్రీగూడెం సబ్ ఇన్స్పెక్టర్ బాలాజీ పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. ఈసందర్భంగా బాలాజీ మాట్లాడుతూ పట్టణాలకే పరిమితమైన ఇటువంటి క్రికెట్ పోటీలు గ్రామీణ ప్రాంతాలలో నిర్వహించడం వల్ల గ్రామీణ యువత మాదక ద్రవ్యాలు, వ్యాసనాలకు ఆకర్షితులు కాకుండా ఆరోగ్యం పొందడానికి దోహద పడుతుందని అన్నారు. రాయుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో క్రికెట్ క్రీడ పట్ల, ఫిట్నెస్ పట్ల ఆసక్తి యువతలో కలిగిస్తే భవిష్యత్ లో రంజీ లాంటి, రాష్ట్ర స్థాయి జాతీయ స్థాయి క్రీడా కారులను తయారు చేయడానికి ఇటువంటి వేదికలు దోహద పడతాయని అన్నారు. ఈటోర్నమెంట్ నిర్వహించిన శ్రీనివాసు, ముసిపల్లి యం పి యల్ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈకార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షులు జుజ్జురపు వెంకట సత్యనారాయణ సుంకవల్లి మధు సోల్మన్ రాజు భావన సురేష్ దుర్గయ్య పూర్ణ ఇంద్ర సీతయ్య నాయుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి: ఆర్డీవో

విశాలాంధ్ర-కొవ్వూరు: మీ కోసం కార్యక్రమంలో డివి జన్ స్థాయి అధికారులు తప్ప నిసరిగా హాజరయ్యి అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన 'పిజిఆర్ఎస్- మీ కోసం' వేదికలో వచ్చిన అర్జీలను ఆర్డీవో స్వీకరించారు. ఈ సందర్భంగా రాణి సుస్మిత మాట్లాడుతూ మీకోసం పిజిఆర్ఎస్ ద్వారా 10 అర్జీలు వచ్చాయని తెలిపారు. జిల్లా అధికారి, డివిజన్ అధి కారులతో సమావేశం నిర్వహించి అర్జీలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వ ఫలాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి : చినరాజప్ప

విశాలాంధ్ర - రాజానగరం : రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్దిదారులకు ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ప్రభుత్వ ఫలాలను, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్ళసిన బాధ్యత నాయకులు, కార్యకర్తలదేనని మాజీ మంత్రి, పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చిన్న రాజప్ప అన్నారు. రుడా ఛైర్మన్, నియోజకవర్గ టీడీపీ అధ్యక్షులు బొడ్డు వెంకట రమణ చౌదరి ఆధ్వర్యంలో పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు అధ్యక్షతన నియోజక వర్గంలోని బూరుగుపూడి పార్టీ కార్యాలయంలో సోమ వారం జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చిన్న రాజప్ప మాట్లాడుతూ త్వరలో ప్రతిష్టాత్మకంగా జరగనున్న సంస్థాగత ఎన్నికలు జరిపించేందుకు పరిశీల కులను, తమను అధిష్టానం పంపినట్లు చెప్పారు. నియోజకవర్గంలో గ్రామ కమిటీలు, మండల కమిటీలు త్వరగా పూర్తి చేయ్యాలని సూచించారు. పార్టీకి సేవలు చేస్తూ ప్రతినిత్యం ప్రజల్లో మమేకమై ఉండేవారిని పార్టీ గుర్తించి పదవులు కట్టబెడుతుందని చెప్పారు. పార్టీ మరింత బలోపేతం కోసం పలు సలహాలు సూచనలు అందించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగిశెట్టి చంటిబాబు, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు కందుల బాబు రాయుడు, పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, కోసూరి రాజా సూరిబాబు, చింతపల్లి సతీష్ కుమార్, కొమ్మిన వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వంక మల్లిఖార్జున స్వామి (మల్లిబాబు), పార్టీ అధికార ప్రతినిధి నూనె వెంకన్న, నాయకులు బచ్చు ప్రసాద్,కొల్లం రత్నం తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలు ఎక్కడ : జక్కంపూడి

విశాలాంధ్ర -రాజమండ్రి సిటీ : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమయ్యాయని మాజీ ఎంఎల్ఏ జక్కంపూడి రాజా ప్రశ్నించారు. రాజమండ్రి దానవాయిపేటలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.చంద్రబాబు ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికల తరువాత మరో మాట మాట్లాడటం ఆనవాయితే అని అన్నారు. మద్యం షాపులను విచ్చల విడిగా ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని మధ్యాంధ్ర ప్రదేశ్‌గా మార్చరని విమర్శించారు. యువత, మహిళలు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను పూర్తిగా మరిచారని అన్నారు. యువత భవిష్యత్ పేరుతో సోమవారం నిర్వహించిన కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతమైందన్నారు. యువత రోడ్లపైకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీసే పరిస్థితి వచ్చిందన్నారు. యువత, రాష్ట్ర ప్రజలు నేడు చెంపలు వేసుకుని కూటమి ప్రభుత్వాన్ని ఎందుకు నెగ్గించుకున్నామని పశ్చత్తాప్తపడుతున్నారని రాజా అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరవాలని సూచించారు.

బాధితులకు గొలుసు అప్పగింత

విశాలాంధ్ర - సామర్లకోట : విశాఖపట్నం పట్టణానికి చెందిన మహిళ కలిపిరెడ్డి నారాయణమ్మ సామర్లకోట పోగొట్టుకున్న మూడు తులాల బంగారు గొలుసును సామర్లకోట సీఐ కృష్ణ భగవాన్, ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావులు సీసీ కెమెరా ఆధారంగా వెతికిపట్టుకుని బాధితరాలకు అప్పగించారు. విశాఖపట్నం కొత్త సాలిపేట, జగదాంబ సెంటర్ ప్రాంతానికి చెందిన కలిపిరెడ్డి నారాయణమ్మ కాకినాడ పట్టణంలోని బంధువుల శుభకార్యానికి వచ్చిన సందర్భంగా బంగారు గొలుసు పెట్టిన పర్సు సామర్లకోట రైల్వే స్టేషన్ సెంటర్లో పోగొట్టుకున్నారు. బాధితురాలు నారాయణమ్మ దంపతులు శుభకార్యానికి హాజరయ్యేందుకు కాకినాడ బస్సు ఎక్కుతూ చూసుకోగా పరచలేకపోవడంతో ఆమె స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ గరగారావుకు ఫిర్యాదు చేశారు. దీంతో ట్రాఫిక్ ఎస్ఐ గరగారావు స్టేషన్ సెంటర్లోని సిసి టీవీ ఫుటేజీలను పరిశీలించి పర్స్ కాజేసింది ఒక సాధువుగా గుర్తించారు. దీంతో సాధువు కోసం రాత్రి 8 గంటల వరకు కాపు కాసి పోలీసులు అతనిని పట్టుకుని మహిళా పోగొట్టుకున్న బంగారు గొలుసులు రికవరీ చేసి బాధితురాలు నారాయణమ్మకు పెద్దాపురం డిఎస్పి డి శ్రీహరి రాజు చేతులమీదుగా అందజేశారు. డిఎస్పీ మాట్లాడుతూ సామర్లకోటలో బంగారు గొలుసును మహిళ పోగొట్టుకోగా సామర్లకోట సిఐ కృష్ణ భగవాన్, ట్రాఫిక్ ఎస్ఐ ఆడప గరగా రావులు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాలతో సీసీటీవీ ఫుటేజ్ ద్వారా ఎంతో చాకచక్యంగా పోగొట్టుకున్న సొత్తును గుర్తించి బాధితురాలికి అప్పగించారన్నారు. స్థానిక సిఐ కృష్ణ భగవాన్‌ను ట్రాఫిక్ ఎస్ఐ గరగా రావులును, సిబ్బందిని డి ఎస్పీ అభినందించగా పోగొట్టుకున్న సొత్తును సాయంకాలా నికల్లా రికవరీ చేసి అందించిన బాధితురాలు నారాయణమ్మ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ముఖర్జీ చిత్రపటానికి నివాళి

విశాలాంధ్ర - ఆత్రేయపురం : ఆత్రేయపురం మండలంలోని వాడపల్లి గ్రామంలో సోమవారం బలిదాన్ దివాస్ సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు యు వెంకటేశ్వరరావు సారథ్యంలో, బూత్ అధ్యక్షుడు పడాల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా ఇన్చార్జి తమనంపూడి రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. డా శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సాంస్కృతిక, ఆర్థిక జాతీయ వాదంతో కూడిన భావజాలానికి మార్గదర్శకుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ. ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిసాన్ నహీ చలేగా అనే నినాదంతో దేశ ఏకత్వం కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు ఆయన అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు, రాష్ట్ర యువమోర్చ కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ అల్లు భాస్కరరావు, కిసాన్ మోర్చా జోనల్ ఇన్ఛార్జ్ చేకూరి రమేష్ వర్మ, ముదునూరి వెంకట సూర్యనారాయణరాజు, సాధనాల సూర్యనా రాయణ, పడాల లక్ష్మీగణపతి, అల్లు త్రిమూర్తులు తదితరులు హాజరయ్యారు.

అన్నప్రసాద భవన నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర - ఆత్రేయపురం : కోనసీమ తిరుమలగా ప్రసిద్దిగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు స్వామివారి వసంత మండపంలో కల్యాణం, అష్టోత్తర పూజలు అర్చకులు ఘనంగా నిర్వహించారు. చందన సరూపుడైన వెంకటేశ్వర స్వామిని భక్తులు దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఈ ఆలయ సన్నిధిలో నూతనంగా నిర్మిస్తున్న వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి ఏలూరు మండలం గౌరవరం వాస్తవ్యులు కలగర రత్న సంపత్, సమత దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ. 51,116లు అందజేశారు. వీరికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి నల్లం సూర్య చక్రధరరావు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు వర్మ, స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు వర్మ, రాపాక శ్రీనివాస్, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

muthoot HOUSING FINANCE

రిజిస్టర్డ్ ఆఫీస్ : టిసి నం.14/2074-7, ముత్తూట్ సెంటర్, పున్నెన్‌రోడ్, తిరువనంతపురం-695 034, సిఐఎన్ నం :యు65922కెఎల్2010పిఎల్‌సి025624 కార్పొరేట్ ఆఫీస్ : 12/ఏ 01, 13వ అంతస్తు, పరిణీ క్రెసెంజో, ప్లాట్ నం.సి38 & సి39, బంద్రా కుర్లా కాంప్లెక్స్-జి బ్లాక్ (ఈస్ట్), ముంబై-400051, టెలి నం : 022-62728517, Email Id: authorised.officer@muthoot.com

అనుబంధం-4 [(నిబంధన 8(1)] స్వాధీనత ప్రకటన (స్థిర ఆస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ చట్టం, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు- 2002 యొక్క నిబంధన 3 తో చదివే సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి **ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృతఅధికారిగా దిగువ సంతకందారు, ఈ కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / హామీదారు(లు) లకు డిమాండ్ నోటీసు జారీచేయడమైనది. డిమాండ్ నోటీసు అందుకున్న తేదీ నుంచి 60 రోజుల గడువు పూర్తయిన తర్వాత కూడా రుణగ్రహీత(లు) / హామీదారు(లు) బాకీ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున పేర్కొన్న నిబంధనల యొక్క నిబంధన 8 తో చదివే చట్టం లోని సెక్షన్ 13 (4) కింద సంక్రమించిన అధికారాలను వినియోగించి, కింద వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **లాంఛనప్రాయంగా స్వాధీనపరుచుకున్నట్లు** రుణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజానీకానికి నోటీసు ఇవ్వడమైనది.

క్ర. సం.	ఎల్ఏఎన్/రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు పేరు	డిమాండ్ నోటీసు తేదీ	బకాయి పడిన మొత్తం (రూ.లలో) భవిష్యత్తు వడ్డీ వర్తించును	స్వాధీనత తేదీ
1.	లోన్ ఎక్కౌంట్ నెం.MHFLPRORJM000005007846, 1.కాతేటి వెంకటేశు అలియాస్ కాతేటి వెంకటేష్ 2. కాతేటి వెంకాయమ్మ, 3. కాతేటి సంధ్య	06 మార్చి-2025	06-మార్చి-2025 నాటికి రూ. 8,16,120.85/-	18-జూన్ -2025
	హామీగా పెట్టిన ఆస్తి(లు)/స్థిర ఆస్తి(లు) వివరాలు: తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి రూరల్ మండలం, పైడింగొయ్యి ఎస్ఆర్‌ఓ పరిధిలు, కొంతమూరు గ్రామ పంచాయతీ, కోలమూరు గ్రామం, ఆర్.ఎస్.నం.322-1, అసెస్‌మెంట్ నం.2394, డి.నం. 115-7-318 వద్ద 342 చదరపు అడుగులు నిర్మిత ప్రదేశముతో గ్రౌండ్ ఫ్లోర్ కలిగియున్న ఆర్‌సిసి పైకప్పు నివాసిత భవనంతోపాటు 68.88 చదరపు గజాల విస్తీర్ణపు భూమితో కూడిన ఆస్తి యావత్తు. హద్దులు: తూర్పు: 20 అ॥ల రోడ్డు, పడమర: పెదపూడి పాపాయమ్మకు చెందిన స్థలం-20అ॥లు, ఉత్తరం: పెనుముత్సు రమణ ఇల్లు-31 అ॥లు. దక్షిణం: యలమంచిలి రామకృష్ణ ఇల్లు-31 అ॥లు.			

ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నెరపరాదని మరియు ఆస్తితో ఎటువంటి లావాదేవీలైనా పైన వివరించినట్లుగా డిమాండ్ చేసిన మొత్తం మరియు దానిపై భవిష్యత్తు వడ్డీకి గాను **ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** చార్జికి లోబడి ఉండునని ఇందుమూలంగా ప్రత్యేకించి రుణగ్రహీత/లు/హామీదారు/లు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్, తేదీ: 24 జూన్, 2025 — సం/- అధీకృత అధికారి, ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరఫున

పాస్ పోర్టు పోయినది

తూ.గో.జిల్లా, గోపాలపురం మండలము, చిట్యాల గ్రామం కాపురస్తులు **లట్టాల ఫణి శ్రీకాంత్** S/o లట్టాల వెంకట రమణ మూర్తి అను నా యొక్క పాస్‌పోర్టు నెం: **S5083859**ను జిరాక్స్ తీయించుకునే నిమిత్తము **ది. 22-05-2025వ తేదీన** మా యింటి నుండి గోపాలపురం వెళ్ళియున్నాను. జిరాక్స్ అనంతరం తిరిగి ఇంటికి వస్తుండగా మార్గములో మధ్యలో పడిపోయినది. సదరు పాస్‌పోర్టు కొరకు వెదకినప్పటికీ దొరకలేదు.

కావున పైన ఉదహరించిన **లట్టాల ఫణి శ్రీకాంత్** అను నా యొక్క పాస్‌పోర్టు నెం: **S5083859** నెంబరుగల పాస్‌పోర్టు దొరికిన యెడల ఈ క్రింది తెలిపిన అడ్రస్సుకు లేదా ఫోన్ నెంబరుకు తెలియజేయగలరని విజ్ఞప్తి చేస్తున్నాను.

లట్టాల ఫణి శ్రీకాంత్
S/o వెంకట రమణ మూర్తి
చిట్యాల గ్రామం, గోపాలపురం మండలం, తూ.గో.జిల్లా.
సెల్: 9573337774

ఏడాది సంక్షేమంపై సమీక్ష

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : సుపరిపాలనలో తొలి అడుగు పేరిట ఏడాది పాలనపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సదస్సు. జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురంధరేశ్వరి, లోకేష్, హాజరైన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీఎస్, ఉన్నతాధికారులు, హెచ్చోడీలు, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు. సదస్సుకు హాజరైన వివిధ కార్పోరేషన్ల ఛైర్మన్లు.. డైరెక్టర్లు. ఏడాది సంక్షేమంపై సమీక్ష... అభివృద్ధిపై అవలోకనం, భవిష్యత్ కార్యాచరణపై చర్చలో తూర్పు గోదావరి జిల్లా నుంచి హాజరైన జిల్లా మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, ఎస్పీ డి నరసింహా కిషోర్, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నదీతీర ప్రాంతాలు పరిశీలన

విశాలాంధ్ర - మామిడికుదురు : రానున్న వరదల సీజన్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్ర స్థాయిలో పర్యటించి అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నట్లు మామిడికుదురు తహసీల్దార్ సునీల్‌కుమార్ తెలిపారు. ఇటీవలే తహసీల్దార్‌గా భాద్యతలు చేపట్టిన ఆయన రానున్న వరదల కారణంగా ప్రభావితమయ్యే లంకా గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికే పాశర్లపూడి, అప్పనపల్లి, పెదపట్నం, బి దొడ్డవరం, పాసర్లపూడి లంకా గ్రామాల్లో ఆయన పర్యటించారు. స్థానిక రెవెన్యూ సిబ్బంది, వివిధ శాఖల అధికారులతో చర్చించి తగు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

విద్యార్థులకు గొడుగుల పంపిణీ

విశాలాంధ్ర - ఆలమూరు : మండలంలోని గుమ్మిలేరు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు గొడుగులు పంపిణీ చేశారు. సుమారు 60 మంది విద్యార్థులకు ఆయన సొంత నిధులతో ఈ గొడుగులను ఉపాధ్యాయుల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం మండలం మల్లాయిదొడ్డి జమిందార్ కాంప్లెక్స్‌లో పేకాట శిబిరం నిర్వహిస్తున్న సమాచారంతో ఆదివారం రావులపాలెం పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. సీఐ శేఖర్ బాబు నేతృత్వంలో సాగిన ఈ సోదాలో పేకాట ఆడుతున్న పది మంది వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.2,04,500 నగదు, పేక కార్డులను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. రావులపాలెం టౌన్‌లో ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నవని, శిబిరం గత కొంతకాలంగా నడుస్తోందన్న ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

ఎంపీడీవోగా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వెంకటేశ్వరరావు సోమవారం పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించారు. మామిడికుదురు మండల ప్రజా పరిషత్ నుండి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇన్ చార్జ్ ఎంపీడీవో పనిచేసిన ఆయన సోమవారం నుండి పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన

విశాలాంధ్ర - కాకినాడ టౌన్ : కల్పనా సెంటర్‌లో నెంబర్ ప్లేట్స్ సరిగా లేని వాహనాలపైన, హెల్మెట్‌వాడకం, ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాలపైన అవగాహన కార్యక్రమం కాకినాడ ట్రాఫిక్-1 పోలీసులు నిర్వహించారు. మోటార్ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ గవర్నమెంట్ వారు జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాడాలని, మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్/ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయరాదనిలి, రాష్ అండ్ నెగ్లిజెన్స్ గా డ్రైవ్ చేయరాదని, మాడిఫైడ్ సైలెన్సర్లు వాడరాదని, సెల్ ఫోన్లో మాట్లాడుతు డ్రైవింగ్ చేయొద్దని, ట్రాఫిక్ రూల్స్ తప్పని సరిగా పాటించాలని, వీఎం యాక్ట్ కొత్త చట్టం ప్రకారం తప్పు చేసిన వాహన దారులకు భారీ జరిమానాలు విధించబడునని తెలియజేయడం జరిగినది. ఆన్లైన్ మోసాలు, ఫేక్ లోన్స్ మోసాలు, ఆన్లైన్ జాబ్స్/వర్క్స్, డిజిటల్ అరెస్టు, 112/100, 1930, 1972 కాల్స్‌పై అవగాహన తెలిపారు. ఈ కార్యక్రమం నందు ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ చీ రమేష్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం అభివృద్ధి

విశాలాంధ్ర - కొత్తపేట : మోదీ పాలంలో దేశం అభివృద్ధి వైపు నడుస్తుందని జిల్లా బీజేపీ ఇంచార్జ్ పొట్లూరి రామ్మోహన్ అన్నారు. కొత్తపేట మండల బీజేపీ అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు అధ్యక్షతన ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 11 ఏళ్ల సుదీర్ఘ పరిపాలనను పురస్కరించుకొని వికసిత భారత్ అమృతకాల సంకల్ప సభ' పేరుతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అంబేద్కర్ కోనసీమ జిల్లా బీజేపీ ఇంచార్జి పొట్లూరి రామ్మోహన్, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, వికసిత భారత్ మండల కన్వీనర్ మలే శ్రీనివాస్ నగేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం గత పదకొండేళ్లలో సామాన్య ప్రజల అభివృద్ధికి అనేక పథకాలు తీసుకొచ్చిందని వివరించారు. గరీబ్ కల్యాణ్ అన్న యోజన ద్వారా కోట్లాది మందికి ఉచిత బియ్యం, ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్ల నిర్మాణం, రుణ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పథకాలు జాతిని 2047 నాటికి ప్రపంచంలో అగ్రస్థానానికి చేర్చే దిశగా నడుస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అయినవిల్లి సత్తిబాబు పాలూరి జయ ప్రకాష్ నారాయణ, దామోదర్, పెన్నాడా నారాయణరావు, భమిడిపాటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ ఫీజు పోరు' ధర్నా

విశాలాంధ్ర - అమలాపురం : వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్ వద్ద ఫీజు పోరు పేరిట నిరసన కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమానికి వైసీపీ పార్టీ నాయకులు. కార్యకర్తలు యువజన విభాగం నాయకులు, విద్యార్థి సంఘ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నాయకులు డీఆర్ఓ రాజకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొమ్మి ఇస్రాయిల్, నియోజకవర్గ వైసీపీ పార్టీ కోఆర్డినేటర్లు పినిపే శ్రీకాంత్, గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి దేవి, పిల్లి సూర్యప్రకాశ్, పితాని బాలకృష్ణ, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, జడ్పీటీసీలు గెద్దం సంపదరావు, పందిరి శ్రీహరి, కొనుకు బాపూజీ, ఎంపీపీలు ఇళ్ల శేషారావు తదితరులు పాల్గొన్నారు.

స్వాతి హెల్పింగ్ హాండ్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ స్థానిక బాలాజీ చెరువు సెంటర్ కాస్మోపాలిటన్ క్లబ్ నందు అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం క్లబ్ అధ్యక్షులు, ఎస్ఎల్‌సిసి మెంబర్ అలై మద్దా వికాష్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో ముందుగా రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్, అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఇన్నర్‌వీల్ కమిటీ మెంబర్ అలై డా చప్పిడి వెంకటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా 106 గవర్నర్ అలై పెంకె గోవిందరాజు, విశిష్ట అతిథిలుగా కాకినాడ జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు మాసమేను గంగయ్య, సౌత్ మల్టిపుల్ ట్రెజరర్ వనం శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 2025-26 సంవత్సరానికి స్వాతి హెల్పింగ్ హాండ్స్ ప్రెసిడెంట్‌గా అలై మద్దా వికాష్, కార్యదర్శిగా అలై నీలపాల శ్రీనివాస్, కోశాధికారిగా అలై కొత్త మెహెర్ శ్రీరాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, క్లబ్ వైస్ ప్రెసిడెంట్‌గా కొనతాల నాగ బాల వరకుమార్, జాయింట్ సెక్రటరీగా అలై సిహెచ్ గణేష్, పిఆర్‌ఓగా దాసరి ప్రసాద్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమానికి ఇన్స్టాలేషన్ ఆఫీసర్ పూర్వపు గవర్నర్ అలై కొవ్వూరి మునిరెడ్డి నూతన కార్యవర్గ విధి విధానాలను తెలియజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ యొక్క ప్రాముఖ్యతను సభ్యులకు తెలియజేసి క్లబ్ సేవలను గ్రామస్థాయిలో విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ గవర్నర్ గోవిందరాజు మాట్లాడుతూ స్వాతి హెల్పింగ్ హాండ్స్ సంవత్సరం రూ.15 లక్షల విలువైన మెడికల్ క్యాంపులను నిర్వహించిందని, ఈ సంవత్సరం మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి క్లబ్‌ను ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాసమేను గంగయ్య, వనం శ్రీనివాసరావు డీసీఎస్ అలై పెంకె శివకుమార్, డీసిటి అలై కిరణ్ కుమార్, డిసి అలై వనం ఉపేంద్రనాథ్, డిసి అలై కాకరపల్లి శ్రీనివాస్, జెడ్ సీలు అలై బాలా త్రిపుర సుందరి, అలై దొడ్డి వీరేంద్ర, డిస్ట్రిక్ట్ పిఆర్‌ఓ అలై దుర్గా సుభద్ర, గార్ అలై కె లక్ష్మీ నాగేంద్ర, సౌత్ మల్టిపుల్ కోఆర్డినేటర్ అలై కె సతీష్, అలై డా సన్యాసిపాత్రుడు, అలై గాలి రవికృష్ణ పాల్గొన్నారు.

ఎంపీడీవో భవాని బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర - మామిడికుదురు : మామిడికుదురు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా గెద్దాడ భవాని సోమవారం భాధ్యతలు చేపట్టారు. ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా అనపర్తి నుంచి మామిడికుదురు ఎంపిడిఓగా వచ్చారు. ఆమెకు మండల పరిషత్ పరిపాలనాధికారి, ఈవోపిఆర్డి, పంచాయతీ సెక్రటరీలు, కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. వివిధ శాఖల ఉద్యోగులు ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంతవరకు ఇక్కడ ఎంపిడిఓగా పనిచేసిన కుసుమ వేంకటేశ్వర రావు బదిలీపై రాజోలు వెళ్లారు.

'అధునాతన కమ్యూనికేషన్‌లపై' ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం

విశాలాంధ్ర - గండేపల్లి : ఆదిత్య యూనివర్సిటీ, సూరంపాలెంలో (జూన్ 23-జూన్ 27, 2025న) "అధునాతన కమ్యూనికేషన్‌లపై" వారం రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం (FDP) ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని జేఎన్‌టీయూ కాకినాడ, ఎన్ఐటి వరంగల్ సంయుక్తంగా నిర్వహించగా, భారత ప్రభుత్వం యొక్క ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఇందుకు స్పాన్సర్ చేసింది.ప్రారంభ సమావేశంలో ఆదిత్య యూనివర్సిటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ శాఖ ప్రొఫెసర్ మరియు కార్యక్రమ కోఆర్డినేటర్ డా. ఉప్పాడ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యాలు వివరించారు. MeitY , జేఎన్‌టీయూ కాకినాడ ద్వారా స్పాన్సర్ చేయడం వల్ల విద్యావేత్తలు, పరిశోధకులకు ఈ FDP అందుబాటులోకి వచ్చింది అని ఆమె తెలిపారు. డిఆర్‌డిఓ, ఇస్రో, దూరదర్శన్ వంటి ప్రముఖ సంస్థల నుండి వచ్చిన నిపుణులు 20కు పైగా సెషన్లను నిర్వహించనున్నారు. జేఎన్‌టీయూ కాకినాడకు చెందిన కో-కోఆర్డినేటర్ డా బి లీలా కుమారి మాట్లాడుతూ, ఈ FDP పరిశోధన ప్రాతినిధ్యంతో కూడినదిగా ఉండి, 5+, 6+, NOMA వంటి అధునాతన కమ్యూనికేషన్ సాంకేతికతల పై ప్రముఖ పరిశ్రమలు, విద్యా సంస్థల నిపుణులు అవగాహన కల్పించనున్నారని తెలిపారు. ఎన్ఐటి వరంగల్‌కు చెందిన చీఫ్ ఇన్వెస్టిగేటర్ డా శ్రీహరిరావు వర్చువల్ రూపంలో హాజరై, ఈ అవకాశాన్ని ఉత్తమంగా వినియోగించుకోవాలని ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ప్రో-చాన్సలర్ డా ఎం శ్రీనివాస రెడ్డి, రిజిస్ట్రార్ డా జి సురేష్, వైస్ చాన్సలర్ డా ఎంబి శ్రీనివాస్, డా ఎస్ రమాశ్రీలు ముఖ్య అతిథులుగా హాజరై, నిర్వహణ బృందాన్ని అభినందిం చారు. మరియు ఫ్యాకల్టీ నైపుణ్యాలను నిరంతరంగా అభివృద్ధి చేయవలసిన అవసరాన్ని వివరించారు.

ఘనంగా సంగీత వెంకటరెడ్డి వర్ధంతి

విశాలాంధ్ర - ఆలమూరు : ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, రాజకీయ దురంధరుడు సంగిత వెంకటరెడ్డి 11వ వర్ధంతి వేడుకలను సోమవారం ఆలమూరు మండలంతో పాటుగా అనేక మండలాల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని పినపళ్ల గ్రామంలో గానుగు చెట్టుసెంటర్, కొత్తూరు జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న మాజీ మంత్రి సంగిత వెంకటరెడ్డి విగ్రహానికి ఆయన కుమారుడు సంగిత గంగరాజు (పెదబాబు), గ్రామ సర్పంచ్ సంగిత సుభాష్ ఆధ్వర్యంలో అభిమానులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. మండపేట, కపిలేశ్వర పురం మండలాల్లో వర్ధంతి వేడుకల్లో పెదబాబు, సుభాష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, యేపూరి వీరబాబు,యనమదల శ్రీనివాస్, నామాల సుబ్బారావు, కపిలేశ్వరపురం జడ్పీటీసీ వట్టికూటి అబ్బు, జనసేన ఎంపీటీసీ పెద్దిరెడ్డి శేషారత్నం, అంగర సర్పంచ్ వాస కోటేశ్వరరావు, అంగర సొసైటీ మాజీ సర్పంచ్ గుడిమెట్ల రాంబాబు పాల్గొన్నారు.

ప్రభాకర్ చౌదిరి విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేస్తాం : ఆదిరెడ్డివాసు

విశాలాంధ్ర-రాజమండ్రి: సీనియర్ కార్మిక నేత , మాజీ ఎంఎల్ఏ చిట్టూరి ప్రభాకర్ చౌదిరి విగ్రహాన్ని త్వరలో ఏర్పాటు చేస్తామని రాజమండ్రి నగర ఎంఎల్ ఏ ఆదిరెడ్డి వాసు తెలిపారు. సోమవారం ఉదయం స్థానిక ఎంఎల్ ఏ కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జట్ల సంఘం అధ్యక్షులు కుండ్రపు రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి వి కొండలరావు, సహాయ కార్యదర్శి సప్ప రమణ తదితర బృందం ఎంఎల్ఏను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మధు మాట్లాడుతూ నగర అభివృద్ధిలో చిట్టూరి పాత్ర చాలా కీలకమైనన్నారు. రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జ్ నిర్మాణం కోసం కృషి చేశారని అన్నారు జట్ల సంఘాన్ని ఏర్పాటు చేసిన కార్మిక ఉద్యమకారుడన్నారు. కార్మిక ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించారని ఆయన గుర్తు చేశారు. తడితోట, వీఎల్ పురం, రోడ్ కమ్ బ్రిడ్జి లాంటి ప్రదేశాలలో నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మధు ఎమ్మెల్యేను కోరారు.

పేదలకు ప్రభుత్వ ఫ్రీ సీటు తిరస్కరిస్తున్న ప్రగతి ప్రైవేట్ స్కూల్

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రైవేట్ స్కూల్లో పేద పిల్లలకు 25 శాతం ఉచిత విద్య కల్పించాలని నిబంధనలు వున్నా కిర్లంపూడి మండలం జగపతినగరం, ప్రత్తిపాడు సమీపంలో ఉన్న ప్రగతి ప్రైవేటు స్కూల్లో ఈ నిబంధనలు అమలు చేయడం కుదరదని స్కూలు యాజమాన్యం చెబుతున్నారు. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ ఫ్రీ సీట్‌కు విద్యాశాఖ ఆన్లైన్ దరఖాస్తు చేసుకోగా ప్రగతి ప్రైవేట్ స్కూల్లో ఉచిత విద్యకు పిల్లలు ఎంపిక కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను సదరు ప్రగతి స్కూల్లో జాయిన్ చేసేందుకు వెళ్ళగా అక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న వనపర్తి జోగేంద్ర అనుమతి నిరాకరిస్తూ జాయిన్ చేసుకోవడం కుదరదని చెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కిర్లంపూడి విద్యాశాఖ అధికారికి విన్నవించారు. దీనిపై విద్యాశాఖ అధికారి స్పందించకపోవడంతో సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా స్థానిక మీడియాతో విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఈ విద్యా సంవ త్సరం ప్రారంభమైన ప్రగతి స్కూల్ ప్రభు త్వం ఫ్రీ సీట్ ద్వారా తమ పిల్లల్ని జాయిన్ చేసుకోవడం నిరాకరిస్తున్నడంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు అలపు రాజ్ కుమార్, జోగా శ్రీను, శెట్టిబత్తుల నానిబాబు, చింత వెంకట రత్నం, గనిశెట్టి సత్యనారాయణ, అలపు మనికుమార్ తెలిపారు.

పెయింటింగ్ కార్మికులు ఏఐటీయూసీలో చేరిక

విశాలాంధ్ర ఏలూరు: ఏలూరు నగరంలో పనిచేస్తున్న పెయింటింగు కార్మికులు,ఆర్టిస్టులు సుమారు 150 మంది ఏఐటీయూసీలో చేరారు.ఈ సందర్భంగా ఆర్ఆర్ పేట స్ఫూర్తి భవనం లో పెయింటింగ్ కార్మికుల యూనియన్ సభ జరిగింది. ఈ సభలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే,జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు,జిల్లా నాయకులు పల్లెం కిషోర్,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ మారిన పరిస్థితులలో పెయింటింగ్ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నిర్మాణ మెటీరియల్ ధరలు పెరగడం వలన,పనులు మందగించాయన్నారు.దానితో కార్మికులకు సరిపడా పనులు దొరకటం లేదన్నారు.దానికి తోడు జూట్ మిల్ వంటి పరిశ్రమలు మూతపడటంతో భవన నిర్మాణంలోకి అదనంగా నిరుద్యోగ కార్మికులు వచ్చి చేరారని తెలిపారు.కార్మికులకు వర్తించే భవన నిర్మాణ సంక్షేమ వెల్ఫేర్ బోర్డు ద్వారా పథకాలు అమలు కాకపోవడం వల్ల పెయింటింగ్ కార్మికులు తీవ్రంగా

నష్టపోతున్నారన్నారు. పెయింటింగ్ కార్మికులు,ఆర్టిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును తిరిగి పునరుద్ధరించాలని సభ తీర్మానించింది. పనులు దొరకని పెయింటింగ్, ఇతర భవన నిర్మాణ కార్మికులకు కరువు భత్యం కింద చెల్లించాలని డిమాండ్ చేశారు.భవిష్యత్తులో పెయింటింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటియుసి యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు.ఈ సభకు పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు అజిత్ కుమార్ అధ్యక్షత వహించగా, యూనియన్ కార్యదర్శి శ్రీనివాస్ కోశాధికారి మహమ్మద్ జాని,నాయకులు పేదారి వంశీ తదితరులు మాట్లాడారు.

ఒలింపిక్ డే రన్ విజయవంతం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం దుడ్డువారి అగ్రహారం నందు గల ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ నందు జరిగిన ఒలింపిక్ డే రన్ కార్యక్రమానికి సంఘ అధ్యక్షులు అల్లాడ శరత్ బాబు అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమమునకు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రంకిరెడ్డి సాత్విక సాయిరాజ్, డిఎస్పి టిఎస్ఆర్కె ప్రసాద్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు, మెట్ల రమణబాబు, డాక్టర్ విష్ణుమూర్తి, డాక్టర్ పిఎస్ శర్మ, మునగాల మన్యం పాల్గొన్నారు. డీఎస్పి ప్రసాద్ మాట్లాడుతూ క్రీడాకారులు సత్ప్రవర్తనతో మెలగాలని రాబోవు సంవత్సరానికి కనీసం ఐదుగురు అయిన జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దబడాలని ఆకాంక్షించితిరి. మెట్ల రమణ బాబు మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని దానిని క్రీడాకారులు సద్వినియోగపరుచుకోవాలని తెలియజేసినారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అంతర్జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు స్థానికుడు రంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్ మాట్లాడుతూ క్రీడల వల్ల ఉన్నత స్థాయికి చేరుకోవచ్చుని, శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం పొందవచ్చని వివరించారు. ఒలింపిక్ డే రన్ టార్చ్ ముఖ్య అతిథి డిఎస్పి

టి ఎస్ఆర్ కె ప్రసాద్ చేతుల మీద ఆవిష్కరించబడినది. ఈ కార్యక్రమములో అమలాపురం మండలంలోని గల వివిధ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు సుమారుగా 300 మంది మరియు ఓఆర్సి సభ్యులు, షటిల్ ఇండోర్ స్టేడియం క్రీడాకారులు, కోచులు, కార్యక్రమమును జయప్రదం చేసినారు. ఈ ఒలింపిక్ డే రన్‌ను జిల్లాలో 22 మండలంలలో మూడు వేల మంది క్రీడాకారులు పాల్గొని ఒలింపిక్ డే రన్‌ను దిగ్విజయంగా విజయవంతం చేశారు. ఈ కార్యక్రమమునకు డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, కల్వకోలను బాబు, ట్రెజరర్ కె భుజంగవాని, కట్ట పురుషోత్తమరావు, ఐ భీమేష్, జి నారాయణరావు, బొంతు మూర్తి, విష్ణు ప్రసాద్, కే గణేష్, టి రవి, వై చంటి, కే సతీష్, గొలకోటి శ్రీను, శ్రీదేవి, నాగమణి, పి ప్రసాద్, పాయసం శ్రీనివాస్, జిమ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు, క్లబ్ సెక్రటరీ తిక్కిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోట్లకు పడగలెత్తిన సీఎం : వైసీపీ నేతలు

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నామని చెబుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన జీవిత ప్రస్థానం 2 ఎకరాలతో ప్రారంభించి రూ.2 లక్షల కోట్లకు పడగలెత్తారని వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొద్దిడి సిద్ధార్థ రెడ్డి విమర్శించారు. వైసిపి అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ఏలూరులో నిర్వహించిన 'యువత పోరు' కార్యక్రమానికి వందలాది మంది వైసీపీ శ్రేణులు, యువత హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జక్కంపూడి రాజా, బొద్దిడి సిద్ధార్థ రెడ్డితో పాటు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, జిల్లా పరిశీలకులు వంక రవీంద్రనాథ్, ఏలూరు పార్లమెంట్ ఇంచార్జ్ కారుమూరు సునీల్, ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి మామిళ్ళపల్లి జయప్రకాష్, చింతలపూడి నియోజక వర్గ ఇన్చార్జ్ కంభం విజయరాజు, ఉంగుటూరు నియోజకవర్గ ఇంచార్జ్ పుప్పాల వాసు బాబు, పోలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ బెల్లం బాలరాజు, ఇతర నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ముందుగా ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ నుండి ర్యాలీగా ప్రారంభమై కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకోవడంతో పోలీసులు వైసీపీ నాయకులను కలెక్టరేట్ లోనికి వెళ్లకుండా బారికేట్లు అడ్డుపెట్టింది. దీంతో కొద్దిసేపు వైసిపి నేతలు పోలీసుల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకుని తోపులాటకు దారితీసింది. అనంతరం వైసిపి నేతలు కూటమి ప్రభుత్వ

తీరును నిరసిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా, బొద్దిడి సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీలు గుర్తించి అధికారం చేపట్టిన సీఎం చంద్రబాబు ఇప్పటివరకు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. యువతకు నిరుద్యోగ భృతి కల్పిస్తామని మాటలు చెప్పి యువతను మోసం చేశారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.3 వేలు నిరుద్యోగ భృతి కల్పిస్తామని చంద్రబాబు యువత హామీ ఇచ్చారని,ఈ ఏడాది తల్లికి వందనం కింద కొంతమంది విద్యార్థులకు మాత్రమే సొమ్ము జమచేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి వైసీపీ నేతలపై భౌతిక దాడులు పెచ్చుమీరాయి అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంతో పాటు సూపర్ సిక్స్ పథకాలు ప్రవేశపెట్టి యువతకు నిరుద్యోగ భృతి చెల్లించాలని లేనిపక్షంలో భవిష్యత్తులో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని రాజా, సిద్ధార్థ రెడ్డిలు హెచ్చరించారు.

12వ పీఆర్సీ కమిటీ నియమించి, ఐఆర్ ప్రకటించాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర - కాకినాడ : ప్రభుత్వం వెంటనే 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించి, మధ్యంతర భృతి ప్రకటిం చడంతో బాటు ఉద్యోగులకు బకాయి పడిన 3 విడతల కరవుభత్యాన్ని వెంటనే చెల్లించాలని జిల్లా ఎస్టీయూ అధ్యక్షులు మోర్ల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్టియు విద్యాభవన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించవలసిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల దీర్ఘ కాలిక సమస్యలపై ప్రభుత్వం స్పందించని పక్షంలో ఉద్యమానికి సన్నద్ధమవుతామని చెప్పారు. సమావేశంలో ఆర్థిక కార్యదర్శి శేశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి యు శ్రీను, రాష్ట్ర కౌన్సిలర్లు సత్యనారాయణ రాజు, ప్రసాద్, పి రామకృష్ణ, సంపత్, కిరణ్మయి, లోవరాజు, సుంకర శ్రీనివాస్, చంద్రశేఖర రావు రామకృష్ణారెడ్డి, మణికంఠ, వింజరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వివాహాలకు చట్టబద్ధత కల్పించాలని వినతి

విశాలాంధ్ర - అమలాపురం : బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు వై హరిబాబు, బిఎస్ఐ జిల్లా అధ్యక్షులు రాంబోధి కాశి ఆధ్వర్యంలో కోనసీమ జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్సీలో కలెక్టర్‌కు 1955 హిందూ వివాహ చట్టం ప్రకారం, బౌద్ధులకు /జైనులకు/సిక్కులకు/ వారి మత సంప్రదాయం ప్రకారం వివాహం చేసుకున్నవారికి రిజిస్టర్ ఆఫీస్‌లో మ్యారేజ్ రిజిస్టర్ చేయ్యాలని చట్టం ఉంటే, కేవలం, వధూవరులు తలపై జీలకర్ర/బెల్లం/సప్తపది/ ఉన్న ఫోటో ఆధారంగా ఉంటేనే రిజిస్టర్ చేస్తున్నారని, మా బౌద్ధ సంప్రదాయ ప్రకారం, వధూవరులు, అంగీకారం, తల్లిదండ్రుల అంగీకారంతో, బుద్ధుని త్రిచరణాలు/పంచశీల/బుద్ధ వందనం ఉచ్చరణతో, పూలదండలు మార్చుకోవడంతో, తల్లి దండ్రుల ప్రమాణంతో, వివాహం సంపూర్ణం అవుతుందన్నారు. పూలదండలు ఉన్న ఫొటో ఆధారంగా 1955 హిందూ వివాహ చట్టం సెక్షన్ 2 (ఎ) ప్రకారం బౌద్ధమత సంప్రదాయ పద్ధతిలో జరిగిన వివాహాలనునీ బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ వారు జారీచేసిన మ్యారేజ్ సర్టిఫికెట్స్‌ను ప్రభుత్వం వారు పరిగణలోకి తీసుకుని బౌద్ధ వివాహాలను రిజిస్టర్ చెయ్యాలని వినతి పత్రం సమర్పించారు. కోలా త్రిమూర్తులు. ములపర్తి సత్యనారాయణ, భరత కూమార్, సింహాద్రి సాకా రాజారావు, కవల రమేష్, వాకపల్లి భీమరావ్, జల్లి రంగరావు, మా టీఏస్ ఐ సంస్థ ద్వారా వివాహ నిర్వహణకు శిక్షణ పొందినవారి జాబితా వారు వివాహ ధృవీకరణ పత్రాలను రిజిస్టర్ చేయాలని కోరగా డిఆర్ఓ రాజకుమారి స్పందిస్తూ జిల్లా రిజిస్ట్రార్‌ను పిలిచి, దీనిపై వెంటనే సమగ్ర రిపోర్ట్ ఇవ్వని ఆదేశించారనీ మీడియాకు రాంబోధి తెలిపారు.

నేడు మరిడమ్మ జాతర మహోత్సవాలు

విశాలాంధ్ర - పెద్దాపురం : కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా ఉమ్మడి రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 24 నుంచి వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఏటా 37 రోజుల పాటు నిర్వహించే వాతర మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 24వ తేదీన జాతర అనంతరం 25వ తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి తెలిపారు.